


APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త






సంపుటి : 01 సంచిక :51 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శనివారం - 29 - ఆగష్టు - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


# రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యం

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు సమర్థవంతంగా ముందుకు తీసుకెళతారని వ్యాఖ్య



అమరావతి: ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

---



‘నిప్పుతో చెలగాటం ఆడొద్దు’..

## బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

ఉక్రెయిన్‌కు బ్రిటన్ క్షిపణి టెక్నాలజీ

దీనిపై తీవ్రంగా స్పందించిన రష్యా

బ్రిటన్ సైనిక స్థావరాలపై దాడి చేస్తామంటూ సంకేతాలు

బ్రిటన్, ఫ్రాన్స్ ‘నిప్పుతో చెలగాటం’ ఆడుతున్నాయని వ్యాఖ్య

2లో

---

## రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు రేవంత్ కు ఉంటాయి

- రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ.. రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ
- రేవంత్ తో పాటు ఆయన అల్లుడు, మనవడికి రాఖీ కట్టిన సురేఖ



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల మిగతా 2 లో

---



శ్రీవారి దర్శనానికి భారీ నిరీక్షణ..

## నిండిపోయిన క్యూ కాంప్లెక్స్‌లు

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

సర్వదర్శనానికి సుమారు 20 గంటల సమయం

నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు, బయట బారులు

గురువారం రూ.4.45 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

2లో

---

## తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం.. మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!



2లో

అసెంబ్లీలో దీర్ఘకాల సంప్రదాయాన్ని పక్కనపెట్టిన సీఎం విజయ్

తన కుర్చీ నుంచి లేచి మంత్రుల మధ్య కూర్చుని ఆశ్చర్యపరిచిన వైనం

ఒక ముఖ్యమంత్రి ఇలా చేయడం ఇదే తొలిసారి అని చెబుతున్న సభా వర్గాలు

సభలో అధికారులు ఉండాలని డిమాండ్ చేసిన ప్రతిపక్ష నేత ఉదయనిధి

---

## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్ శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

### జాతీయ రహదారి-16కి అత్యంత సమీపంలో రూపుదిద్దుకుంటుంది

- రూ. 100 కోట్లతో చదలవాడ వద్ద 5 స్టార్ హోటల్
- రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో హోటల్
- హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు ఉపాధి



అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించి ఒక కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు పరిసర ప్రాంతమైన చదలవాడ వద్ద రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ ‘రాడిసన్’ 5 స్టార్ హోటల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రసిద్ధ రవిశంకర్ గ్రూప్, రవిప్రియ మిగతా 2 లో

---

## అమృత్ 2.0 ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

- ఒంగోలు తాగునీటి కష్టాలకు చెక్.. రంగరాయుడు చెరువు వద్ద కొత్త ప్రాజెక్టు
- ఒంగోలు నగరానికి 24 గంటల తాగునీటి సరఫరాకు శ్రీకారం
- రూ.424.42 కోట్ల అంచనా వ్యయంతో పథకం అమలు
- 51 వేలకు పైగా ఇళ్లకు కొత్తగా కనెక్షన్లు.. 605 కి.మీ. పైప్‌లైన్



ప్రకాశం జిల్లా: ప్రకాశం జిల్లా ఒంగోలు నగర ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. మిగతా 2 లో

---



2లో

2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్..

## ఆతిథ్య బిడ్‌పై అమిత్ షా సమీక్ష

2036 ఒలింపిక్స్ బిడ్డింగ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్ష

అహ్మదాబాద్ వేదికగా పలు అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు ప్లాన్

2030 కామన్వెల్త్, 2029 పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌పై కూడా చర్చ

భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా మార్చడమే లక్ష్యమన్న అమిత్ షా

సన్నాహకాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న హోంమంత్రి

---

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

### జిల్లా సంస్కృతికి ప్రతీకగా ఒంగోలు గిత్త విగ్రహం ఆవిష్కరణ

- మంగళగిరిలోని అరణ్యభవన్ లో బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- కేబినెట్ హోదాతో గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి
- బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు అర్ధాంగి పద్మజ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. మిగతా 2 లో

---



2లో

నేపాల్‌ను ముంచెత్తిన వరదలు..

## 5 నెలల ముందే హెచ్చరించిన నివేదిక

నేపాల్ వరదల్లో 272 మంది మృతి

ఐదు నెలల ముందే హెచ్చరించిన ఐసీఐఎంఓడీ నివేదిక

హిమాలయాల్లో రెట్టింపైన వేగంతో కరుగుతున్న మంచు

---

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇళ్లు

- జీహెచ్ఎంసీ పరిధిలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- మొదటి విడతలో 7,350 ఇళ్ల కేటాయింపు ప్రక్రియ
- 10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా వెల్లడి
- విలువైన భూముల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు మిగతా 2 లో

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త

జనరల్ న్యూస్

శనివారం - 29 - ఆగష్టు - 2026

## నేపాల్‌ను ముంచెత్తిన వరదలు..
# 5 నెలల ముందే హెచ్చరించిన నివేదిక

నేపాల్: నేపాల్‌ను ఇటీవల అతలాకుతలం చేస్తూ 272 మంది మృతికి కారణమైన ఆకస్మిక వరదలపై ఐదు నెలల ముందే ప్రమాద ఘంటికలు మోగాయి. ఖాట్మండు కేంద్రంగా పనిచేసే 'ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెన్ డెవలప్‌మెంట్' (×జ×మీణ) ఈ ఏడాది మార్చిలోనే హిందూకుష్ హిమాలయాల్లో హిమానీనదాలు ప్రమాదకర స్థాయిలో కరుగుతున్నాయని రెండు నివేదికల ద్వారా హెచ్చరించింది. ఐసీఐఎంఓడీ నివేదిక ప్రకారం, 2000వ సంవత్సరం నుంచి హిందూకుష్ హిమాలయాల్లో మంచు కరిగే వేగం రెట్టింపు అయింది. 1975 నుంచి ఇప్పటివరకు దాదాపు 27 మీటర్ల మందంపాటి మంచు పొర కరిగిపోయింది. 1990-2020 మధ్య కాలంలో ఈ ప్రాంతంలోని హిమానీనదాలు తమ మొత్తం విస్తీర్ణంలో 12 శాతం, మంచు నిల్వల్లో 9 శాతాన్ని కోల్పోయాయి. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి విషమించే ప్రమాదం ఉందని, ఈ ప్రక్రియను తిరిగి పూర్వస్థితికి మళ్లించడం సాధ్యం కాకపోవచ్చని కూడా ఆ నివేదిక స్పష్టం చేసింది. నేపాల్ వరదలకు గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుగుతున్నప్పటికీ, శాస్త్రవేత్తలు కొన్ని అంశాలను ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గతంలో కేవలం మంచు కురిసే 4,000 మీటర్ల ఎత్తైన ప్రాంతాల్లో ఇప్పుడు వర్షాలు కురవడం, వేగంగా మంచు కరగడం, ఎత్తైన శిఖరాల నుంచి మంచు-రాళ్ల చరియలు విరిగిపడి నదుల్లో కలవడం వల్లే ఈ ఆకస్మిక వరదలు సంభవించి ఉండవచ్చని భావిస్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల మంచు కరిగి, నేల వేడెక్కడం మూలంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం పెరుగుతోందని ఐసీఐఎంఓడీ నిపుణుడు మహ్మద్ ఫరూక్ అజమ్ పేర్కొన్నారు. ధ్రువ ప్రాంతాల తర్వాత ప్రపంచంలోనే అత్యధిక మంచు నిల్వలు హిమాలయాల్లోనే ఉన్నాయి. వీటిని "ఆసియా వాటర్ టవర్స్" అని పిలుస్తారు. ఇక్కడి నుంచి ప్రవహించే 10 ప్రధాన నదీ వ్యవస్థలపై సుమారు రెండు బిలియన్ల మంది ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు.

# చరిత్రలోనే అతిపెద్ద డ్యామ్ విపత్తు: ఒక్క రాత్రిలో
## 62 డ్యాములు బద్ధలు.. 2.30 లక్షల మంది బలి!

ఢిల్లీ: నేపాల్‌లో సంభవించిన తాజా వరదల నేపథ్యంలో, ప్రకృతి ప్రకోపానికి మానవ నిర్మిత కట్టడాలు చిక్కితే జరిగే విధ్వంసానికి చైనాలోని బాంకియావో డ్యామ్ ఉదంతమే ఒక ప్రబల నిదర్శనం. ప్రపంచ చరిత్రలోనే అత్యంత దారుణమైన డ్యామ్ వైఫల్యంగా ఇది మిగిలిపోయింది. ఈ ఘోర విపత్తులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2,30,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 1975 ఆగస్టులో వచ్చిన 'నీనా' టైఫూన్ ప్రభావంతో చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో రికార్డు స్థాయి వర్షాలు కురిశాయి. కేవలం 24 గంటల వ్యవధిలోనే 1,000 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో బాంకియావో డ్యామ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆగస్టు 7వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత డ్యామ్ పైనుంచి నీరు పొంగిపొర్లి, కేవలం ఆరు గంటల వ్యవధిలోనే అది కుప్పకూలిపోయింది. దీని ఫలితంగా సుమారు 701 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో జనావాసాలపై విరుచుకుపడింది. ఈ ఉధృతికి సమీపంలోని సిమన్‌తాన్ డ్యామ్‌తో పాటు మొత్తం 62 ఆనకట్టలు ఒకదాని తర్వాత ఒకటి పేకమేడల్లా కూలిపోయాయి. ఈ జల ప్రళయానికి తక్షణమే సుమారు 26,000 మంది బలవ్వగా, అనంతరం ఏర్పడిన కరవు, అంటువ్యాధుల కారణంగా మొత్తం మృతుల సంఖ్య 2.30 లక్షలకు చేరిందని అంతర్జాతీయ నివేదికలు అంచనా వేశాయి. అయితే, చైనా ప్రభుత్వం ఈ మహా విషాదం తాలూకు వివరాలను దాదాపు రెండు దశాబ్దాల పాటు ప్రపంచానికి తెలియకుండా అత్యంత గోప్యంగా ఉంచింది. 1951-52 మధ్య కాలంలో నిర్మించిన ఈ డ్యామ్‌ను ఒకప్పుడు 'ఐరన్ డ్యామ్' అని పిలిచేవారు. కానీ నిర్మాణ లోపాలు, అధికారుల వైఫల్యాలు, సరైన సమయంలో హెచ్చరికలు జారీ చేయకపోవడం వంటివి ఈ ఘోర విషాదానికి ప్రధాన కారణాలని విశ్లేషణలు వెల్లడించాయి. ఈ ఘటన జరిగిన సుదీర్ఘ కాలం తర్వాత, పాత డ్యామ్ స్థానంలో 1993లో నూతన ఆనకట్టను నిర్మించారు.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా
# బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం..
# మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర అసెంబ్లీలో ఓ కొత్త సంప్రదాయానికి తెరలేపారు. శాసనసభలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పద్ధతికి భిన్నంగా, తన కోసం కేటాయించిన ప్రత్యేక కుర్చీని వీడి, మంత్రుల కోసం ఉన్న వరుసలో వారి పక్కనే కూర్చుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఘటన సభలో ఆసక్తికర చర్చకు దారితీసింది. సాధారణంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రికి స్పీకర్ కుర్చీకి దగ్గరగా, ప్రత్యేకమైన, విశాలమైన కుర్చీని కేటాయిస్తారు. మంత్రులు వారి సీనియారిటీ ప్రకారం సీఎం పక్కన మొదటి వరుసలో కూర్చుంటారు. వారికి ఎదురుగా ప్రతిపక్ష నేత, ఇతర శాసనసభాపక్ష నేతలు ఆసీనులవుతారు. ఇది ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం. అయితే, నిన్న మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీఎం విజయ్ అనూహ్యంగా తన కుర్చీ నుంచి లేచి, సభా నాయకుడైన మంత్రి కేఏ సెంగొట్టయాన్, మరో మంత్రి ఆదవ్ అర్జున మధ్యలో కూర్చున్నారు. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కొద్దిసేపు తమ సహచరులతో మాట్లాడేందుకు స్థానాలు మారడం సహజమే. కానీ, ఒక ముఖ్యమంత్రి తన అధికారిక కుర్చీని వీడి మంత్రుల సీట్లో కూర్చోవడం ఇదే మొదటిసారని, గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇలా చేయలేదని సభా వర్గాలు చెబుతున్నాయి.

### అధికారుల హాజరుపై ప్రతిపక్ష నేత డిమాండ్

ఇదిలా ఉంటే.. అంతకుముందు సభలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల కార్యదర్శులు సభలో తప్పనిసరిగా ఉండేలా చూడాలని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పీకర్‌ను కోరారు. "గత డీఎంకే ప్రభుత్వ హయాంలో కరూర్ ఘటనపై చర్చ జరిగినప్పుడు అప్పటి సీఎం (ఎంకే స్టాలిన్), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు సభలోనే ఉన్నారు. కానీ ఇప్పుడు సీఎం, కార్యదర్శులు ఎవరూ సభలో లేరు" అని ఆయన ప్రస్తావించారు. దీనిపై మంత్రి ఆదవ్ అర్జున స్పందిస్తూ, కార్యదర్శులు పక్కనే ఉన్న 'వార్ రూమ్' నుంచి సభ్యుల ప్రసంగాలను నోట్ చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఉదయనిధి వాదనతో స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ఏకీభవించారు. ఇకపై కీలక చర్చల సమయంలో సీనియర్ అధికారులు సభలో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, సీఎం విజయ్ ఉదయం కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని, ఆ తర్వాతే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని తెలిసింది.

## బీసీ, ఈబీసీ విద్యార్థులకు గుడ్‌న్యూస్..
# విదేశీ చదువులకు తెలంగాణ సర్కార్ సాయం!

హైదరాబాద్: విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 'మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి' పథకం కింద దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ విడతలో 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనుంది. మొత్తం 350 మందిలో 250 మంది బీసీ విద్యార్థులు ఉంటారు. మరో 100 మంది ఈబీసీ విద్యార్థులను ఎంపిక చేస్తారు. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. విదేశీ విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన ఉన్నత విద్య అభ్యసించాలనుకునే పేద, మధ్యతరగతి బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థుల కలలను సాకారం చేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. అర్హత ఉన్న విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ఒంగోలు తాగునీటి కష్టాలకు చెక్..
# రంగరాయుడు చెరువు వద్ద కొత్త ప్రాజెక్టు

ప్రకాశం జిల్లా: ప్రకాశం జిల్లా ఒంగోలు నగర ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరానికి 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. రంగరాయుడు చెరువు వద్ద రూ.424.42 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ పథకానికి ఆయన నేడు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఒంగోలు నగరంలోని 35 డిస్ట్రిబ్యూషన్ జోన్లను పునర్వ్యవస్థీకరిస్తారు. మొత్తం 605.30 కిలోమీటర్ల పొడవున కొత్త పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను నిర్మించి, 51,340 గృహాలకు నేరుగా సర్వీస్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. దీని ద్వారా నగరంలోని ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందనుంది. పెరుగుతున్న నగర జనాభా అవసరాలకు అనుగుణంగా ఈ ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం నిర్ణీత సమయాల్లో కాకుండా 24 గంటలూ నీటిని అందుబాటులో ఉంచడమే ఈ ప్రాజెక్ట్ ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, విజయ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో సైతం గృహాలను నిర్మించి అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. రాబోయే పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితాను కూడా ప్రకటించే అవకాశం ఉందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు.

## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ..
# రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.

# వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది

హైదరాబాద్: కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్' అని తేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు. మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్‌ఫిట్‌గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

## ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి..
# 20 విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

అమరావతి: సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఒంగోలు నగరంలో భారీ కార్యక్రమం జరిగింది. నగరంలోని కిమ్స్ హాస్పిటల్ ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదే వేదికపై ప్రకాశం జిల్లా సంస్కృతి, పశుసంపదకు ప్రతీకగా నిలిచే ఒంగోలు గిత్త విగ్రహాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, మహనీయుల జీవితాలు, వారి సేవలు, స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు నేటి యువతకు, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్యా, సాహిత్య రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖుల విగ్రహాలను ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం కనిపించేలా ప్రధాన కూడలిలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా మహనీయుల సేవలు, త్యాగాలు, ఆశయాలు ప్రజలకు మరింత చేరువవుతాయని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తిదాయక విగ్రహాలు ఒంగోలు నగరానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆయన తెలిపారు.

ఒంగోలు గిత్త.. జిల్లాకే గర్వకారణం

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన ఒంగోలు జాతి పశువుల విశిష్టతను చాటిచెప్పేలా, జిల్లా సంస్కృతికి అద్దం పట్టేలా ఒంగోలు గిత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రకాశం జిల్లా పశుసంపదకు, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, దీని ప్రాముఖ్యతను భావితరాలకు పరిచయం చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రాంనారాయణ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించిన విగ్రహాల వివరాలు:

రాజకీయ, స్వాతంత్ర్య సమరయోధులు: రొండా నారపరెడ్డి (మాజీ మంత్రి, ఎంపీ), దర్శి చెంచయ్య (స్వాతంత్ర్య సమరయోధుడు), మాదాల నారాయణ స్వామి (మాజీ ఎంపీ, ఎమ్మెల్యే) సామాజిక సేవకులు, విద్యావేత్తలు, అధికారులు: కత్తి చంద్రయ్య (ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్), వరదా శ్రీరాముల నాయుడు (ఒంగోలు తొలి పురపాలక సంఘ అధ్యక్షులు), బివియల్ నారాయణ ('పావలా డాక్టర్'), క్లౌ జాన్ ఎవరెట్ (సామాజిక సేవకులు), గోరంట్ల వెంకన్న (మహాదాత), శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి (ద్రావిడ భాషాశాస్త్ర పితామహులు), బండారు రామారావు (నాటక సమాజ నిర్వాహకులు). కళా, సాహిత్య రంగ ప్రముఖులు: భానుమతి రామకృష్ణ (బహుముఖ ప్రజ్ఞాశాలి, నటి), గరికపాటి వరలక్ష్మి (నటి, గాయని), టి. కృష్ణ (విప్లవ దర్శకులు), షేక్ చినమౌలానా (నాదస్వర విద్వాంసులు), నీలంరాజు వెంకట శేషయ్య (పాత్రికేయులు, సాహితీవేత్త), ధారా రామనాథ శాస్త్రి (నాట్యావధాని), నాగభైరవ కోటేశ్వరరావు (కవి, రచయిత), కలేకూరి ప్రసాద్ (దళిత కవి, రచయిత), పైడి తెరేష్ బాబు (దళిత సాహితీవేత్త, కళాకారులు), మల్లవరపు జాన్ (కవి, రచయిత).

# ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్
## శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్



అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించి ఒక కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు పరిసర ప్రాంతమైన చదలవాడ వద్ద రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ 'రాడిసన్' 5 స్టార్ హోటల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రసిద్ధ రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ప్రతిష్ఠాత్మక హోటల్ రూపుదిద్దుకోనుంది. ఒంగోలు ప్రాంతంలో ఏర్పాటు కాబోతున్న మొదటి అంతర్జాతీయ బ్రాండెడ్ 5 స్టార్ హోటల్ ఇదే కావడం విశేషం. 151 విలాసవంతమైన గదులు, మల్టీ-క్యూసిన్ రెస్టారెంట్లు, ప్రీమియం బార్, లాంజ్, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్ వంటి అత్యాధునిక సదుపాయాలతో దీనిని తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా, బిజినెస్ టూరిజం విస్తరణకు అనుగుణంగా 2,100 చదరపు మీటర్లకు పైగా విశాలమైన స్థలంలో భారీ బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి-16కి అత్యంత సమీపంలో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ వల్ల పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, పర్యాటకులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విలాసవంతమైన 5 స్టార్ హోటల్ రాకతో ఒంగోలు, దాని పరిసర ప్రాంతాల్లో హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం లోకేశ్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. అభిమానులతో ఫొటోలు దిగుతూ, వారి నుంచి వినతులను స్వీకరించారు. రక్షా బంధన్ సందర్భంగా పలువురు మహిళా కార్యకర్తలు లోకేశ్‌కు రాఖీలు కట్టి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'లేక్ ఒంటారియో' పేరు మార్పు..
# 'లేక్ అమెరికా'గా ప్రకటించిన ట్రంప్

ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా, కెనడా సరిహద్దుల్లో ఉన్న గ్రేట్ లేక్స్‌లో ఒకటైన 'లేక్ ఒంటారియో' పేరును 'లేక్ అమెరికా'గా మారుస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఈ సరస్సు అత్యంత కీలకమని, దాని ప్రాధాన్యతను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 30 రోజుల్లోగా ఈ పేరు మార్పు ప్రక్రియను పూర్తి చేయాలని అమెరికా అంతర్గత వ్యవహారాల కార్యదర్శిని, భౌగోళిక నామకరణాల బోర్డును ఆదేశించారు. ఈ నిర్ణయానికి గల కారణాలను ట్రంప్ తన ఉత్తర్వుల్లో స్పష్టంగా వివరించారు. "గ్రేట్ లేక్స్ పరిరక్షణలో అమెరికానే గొప్ప సంరక్షకుడిగా ఉంది. అమెరికా అందిస్తున్న భద్రత, పెడుతున్న పెట్టుబడులు లేకపోతే ఈ మంచినీటి వ్యవస్థ నౌకాయానానికి, వినోదానికి ఈ స్థాయిలో అందుబాటులో ఉండేది కాదు" అని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంలో గ్రేట్ లేక్స్ పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ కోసం అమెరికా దాదాపు 4 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టిందని, కెనడా పెట్టుబడులు చాలా తక్కువని ఆయన అన్నారు. గ్రేట్ లేక్స్‌లో మంచును తొలగించే 11 నౌకల్లో 9 అమెరికా కోస్ట్ గార్డ్ నిర్వహిస్తున్నవేనని గుర్తుచేశారు. చారిత్రకంగా, వాణిజ్యపరంగా, రక్షణాపరంగా కూడా ఈ సరస్సు అమెరికాకు ఎంతో ముఖ్యమని ట్రంప్ తెలిపారు. న్యూయార్క్‌లోని ఓస్వెగో చారిత్రక కోటగా, సెయింట్ లారెన్స్ సీవే నుంచి అమెరికాలోకి వచ్చే మొదటి ఓడరేవుగా నిలిచిందని ప్రస్తావించారు. ఈ సరస్సు నీటిని తాగునీటి అవసరాలకు, విద్యుత్ ప్లాంట్లకు వినియోగిస్తున్నారని, లక్షలాది అమెరికన్ల ఉద్యోగాలకు ఈ ప్రాంతం ఆధారమని తెలిపారు. అయితే, ఈ పేరు మార్పు కేవలం అమెరికా ఫెడరల్ ప్రభుత్వ వినియోగానికి మాత్రమే వర్తిస్తుంది. ఫెడరల్ ప్రభుత్వ పటాలు, పత్రాలు, ఒప్పందాలు, అధికారిక సమాచారంలో మాత్రమే 'లేక్ అమెరికా' అనే పేరును వాడతారు. కెనడా, అంటారియో ప్రావిన్స్, అంతర్జాతీయ సంస్థలు లేదా ప్రైవేట్ మ్యాప్ ప్రొవైడర్లు ఈ కొత్త పేరును ఉపయోగించాల్సిన అవసరం లేదు. ట్రంప్ ఒక భౌగోళిక ప్రాంతం పేరు మార్చడం ఇదే మొదటిసారి కాదు. 2025 జనవరిలో 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో' పేరును ఫెడరల్ అవసరాల కోసం 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తూ ఆయన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

## 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు'..
# బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

ఢిల్లీ: ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది. ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 'నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయి' అని హెచ్చరించారు. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిస్పందన తప్పదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లోనే స్టార్మ్ షాడో క్షిపణులను తయారు చేసుకునే సాంకేతికతను బ్రిటన్ ఇవ్వనుందని లండన్ ప్రకటించింది. దీంతో పాశ్చాత్య దేశాల నుంచి క్షిపణుల సరఫరాపై ఉక్రెయిన్ ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. సుదూర ప్రాంతాల్లో దాడులు చేసే సామర్థ్యం పెరుగుతుంది. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరాలపైనా దాడులు జరిగే అవకాశం ఉందని జఖరోవా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బ్రిటన్-రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది. ఇదే సమయంలో రష్యా-నాటో మధ్య ఉద్రిక్తతలపైనా చర్చ జరుగుతోంది. రష్యా నాటో సభ్యదేశంపై పరిమిత దాడికి ప్రయత్నించే అవకాశం ఉందన్న అమెరికా నిఘా అంచనాలపై వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను రష్యా ఖండించింది. నాటోతో తలపడేందుకు తమ దేశం సిద్ధమవుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

## శ్రీవారి దర్శనానికి భారీ నిరీక్షణ..
# నిండిపోయిన క్యూ కాంప్లెక్స్‌లు

తిరుపతి: తిరుమల శ్రీవారి దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తడంతో తిరుమల కొండపై రద్దీ విపరీతంగా పెరిగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో, భక్తులు వెలుపల ఉన్న క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 20 గంటల సమయం పడుతోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ సిబ్బంది నిరంతరాయంగా పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. ఇక నిన్న (గురువారం) మొత్తం 66,437 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 26,771 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ద్వారా రూ.4.45 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ దృష్ట్యా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్..
# ఆతిథ్య బిడ్‌పై అమిత్ షా సమీక్ష

ఢిల్లీ: భారత్‌లో అంతర్జాతీయ క్రీడా సంబరాలకు రంగం సిద్ధమవుతోంది. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా సన్నాహకాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఒలింపిక్స్ బిడ్డింగ్ ప్రక్రియ పురోగతిని, క్రీడల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. ఒలింపిక్స్‌తో పాటు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2029లో జరగనున్న పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌ను కూడా అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశం అనంతరం అమిత్ షా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లను నిర్వహించడం ద్వారా భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా నిలబెట్టడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, క్రీడా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, గుజరాత్ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. అహ్మదాబాద్‌లో క్రీడల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లపై అధికారులు అమిత్ షాకు వివరించారు. ఇటీవల గ్లాస్గోలో 2026 కామన్వెల్త్ గేమ్స్ ముగిసిన తర్వాత, తదుపరి ఆతిథ్య నగరంగా అహ్మదాబాద్ తరఫున గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కామన్వెల్త్ గేమ్స్ పతాకాన్ని అందుకున్న విషయం విదితమే.

## దేశ సంపదను పెంపొందించడానికి
# కలిసికట్టుగా కృషి చేద్దాం



హైదరాబాద్: సింగరేణి, కర్ణాటక విద్యుత్ సంస్థ (కేపీసీఎల్) సంయుక్త భాగస్వామ్యంతో (జాయింట్ వెంచర్) కలిసి పనిచేద్దామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. బెంగళూరులో కర్ణాటక ఇంధనశాఖ మంత్రి కె.జె.జార్జ్‌తో ఆయన సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య ఇంధన రంగ పురోగతి, బొగ్గు సరఫరా, సాంకేతికత మార్పిడిపై ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో కర్ణాటక అదనపు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తా, కేపీసీఎల్ ఎండీ రాజేంద్ర చోళన్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో బొగ్గు తవ్వకంలో సింగరేణి సంస్థతో కేపీసీఎల్ కలిసి పనిచేస్తే బాగుంటుందని భట్టి ప్రతిపాదించగా.. జార్జ్ సానుకూలంగా స్పందించారు. కర్ణాటకలో పారిశ్రామిక ప్రగతి కారణంగా విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతోందని, థర్మల్ ప్లాంట్లకు తెలంగాణ బొగ్గును నిరంతరం సరఫరా చేయాలని జార్జ్ కోరగా భట్టి సానుకూలంగా స్పందించారు. కర్ణాటకలోని దేవదుర్గ్ గని నుంచి బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించడానికి కలిసికట్టుగా కృషి చేద్దామని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాయచూరు జిల్లా దేవదుర్గ్ తాలూకా లింగదహల్లి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రాగి, బంగారం అన్వేషణ (సర్వే) కార్యక్రమాన్ని గురువారం భట్టి ప్రారంభించారు. సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం భట్టి విక్రమార్క ఖనిజ అన్వేషణ ప్రదేశాలకు వెళ్లి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ్ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ (అన్వేషణ) హక్కులను దక్కించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ బంగారం, రాగి విరివిగా లభిస్తే యువతకు ఉపాధి లభించడమే కాకుండా శీఘ్రగతిన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో త్వరలోనే ఆఫీస్‌ను, హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. కృష్ణానదికి ఇరువైపులా ఉన్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య విడదీయరాని బంధం ఉందని భట్టి పేర్కొన్నారు. అనంతరం ఆ ప్రాంతంలో సింగరేణి అధికారులు సేకరించిన వివిధ రకాల ఖనిజ నమూనాలతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లింగదహల్లి గ్రామంలోని పరమానంద శివాలయంలో ఆయన పూజలు నిర్వహించారు.

APTEL/26/A4813
శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త



# పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగాని,

డాక్టర్ కమల అనగానిల చేతుల మీదుగా రాఖీ కట్టించుకున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

సోదరీమణుల ఆశీస్సులు పొందడం తన పూర్వజన్మ సుకృతమని,

వారి ప్రేమానురాగాలు తనకు నిత్యం ప్రజాసేవలో కొండంత బలాన్ని ఇస్తాయని ఉద్ఘాటన!

రేపల్లె నియోజకవర్గ ఆడబిడ్డలందరికీ హృదయపూర్వక రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి!



బాపట్ల జిల్లా రేపల్లె ఆగస్టు 28 : అక్కాతమ్ముళ్ల అనురాగానికి, అన్నాచెల్లెళ్ల పవిత్ర ప్రేమానుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రేపల్లె నియోజకవర్గంలో రాఖీ వేడుకలు అత్యంత ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తన సోదరీమణుల చేతుల మీదుగా రాఖీ కట్టించుకోవడం తన మనసుకు ఎంతో



ఆనందాన్ని, ఉత్సాహాన్నిచ్చిందని ఉద్వేగభరితంగా ప్రసంసించారు. చిన్నతనం నుంచీ అమ్మలా లాలించి, జీవితంలో ఎదుగుదలలో అడుగడుగునా ప్రోత్సహిస్తూ, ప్రజాసేవ దిశగా నిత్యం మార్గదర్శనం చేసిన తన ప్రియమైన సోదరీమణులు - ప్రముఖ పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగాని, డాక్టర్ కమల అనగానిల చేతుల మీదుగా రాఖీ కట్టించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అమ్మ చూపే ప్రేమలో సగం, నాన్న ఇచ్చే ధైర్యంలో సగం ఈ రెండూ కలిపితే తమ సోదరీమణులు అందించే ఎనలేని అనురాగమని కొనియాడారు. నిత్యం ప్రజాసేవలో బిజీబిజీగా గడిపే తనకు, ప్రతి ఏటా ఇలా తోబుట్టువుల ప్రేమానురాగాలు అందుకోవడం కొండంత బలాన్ని ఇస్తుందని, జన్మజన్మలకూ వారి సోదరుడిగా పుట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ పండుగ సందర్భంగా రేపల్లె నియోజకవర్గంలోని సమస్త ఆడబిడ్డలకు మంత్రి హృదయపూర్వక రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. గత రెండు దశాబ్దాలుగా తనను సొంత సోదరుడిగా గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్న రేపల్లె అక్కాచెల్లెళ్ల రుణం ఏనాటికీ తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ ఆడబిడ్డ తన తోబుట్టువులతో సమానమని స్పష్టం చేశారు. ఈ పవిత్ర బంధం సాక్షిగా రేపల్లె ఆడబిడ్డలకు మంత్రి ఒక భరోసా ఇస్తూ.. మిమ్మల్ని నా కంటికి రెప్పలా కాపాడుకుంటానని, మీ ప్రతి కష్టసుఖాల్లో ఓ అన్నగా, ఓ తమ్ముడిగా ఎప్పుడూ వెంటే ఉండి శ్రీరామరక్షగా నిలుస్తానని మాటిచ్చారు. తన కుటుంబమైన రేపల్లె ఆడబిడ్డల చిరునవ్వుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తానని పునరుద్ఘాటించారు.

# శ్రావణ మాస ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




కర్నూలు జిల్లా ఆగస్టు 28 : ఉరుకుంద ఆలయ శ్రావణ మాస ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని, శ్రావణ మాస ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుండి ఉరుకుంద ఆలయంలో జరగనున్న శ్రావణ మాస ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాదాయ, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు తాగునీటి కొరత లేకుండా త్రాగునీరు నిరంతరంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ ప్రాంతంతో పాటు ఆలయ పరిసరాల్లో రాత్రి వేళల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా ఫోకస్ లైట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉరుకుంద ఆలయ ఈవో ను ఆదేశించారు. భక్తులకు 24 గంటలపాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో అన్ని వైపుల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.. ప్రస్తుతం పార్కింగ్ స్థలాలు ఎక్కువగా ప్రైవేటు భూముల్లో ఉండటంతో భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, శాశ్వత పార్కింగ్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదోని ఆర్డీవో ను ఆదేశించారు.. అలాగే ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, అగ్నిమాపక సేవలు తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.. ప్రస్తుతం కుప్పగల్లు-ఉరుకుంద సింగిల్ లేన్ రహదారిపై మరమ్మతులు, పూడ్చివేత పనులను నిరంతరం చేపట్టి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. కుప్పగల్లు - ఉరుకుంద, కోసిగి--ఉరుకుంద రహదారులను డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అదే విధంగా, ఉరుకుంద ఆలయానికి శాశ్వతంగా నీటి సరఫరా కోసం పైప్‌లైన్ ఏర్పాటు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు.. సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సుధాకర్ రెడ్డి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇరిగేషన్ ఎస్ఈ శైలేశ్వర్, ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, ఉరుకుంద ఆలయం ఈఓ వాణి, పోలీస్, వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ నిర్వహించిన జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట ఎమ్మెల్యే వేగేశన '




బాపట్ల ఆగస్టు 28: బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండలం పిట్టలవానిపాలెం గ్రామంలో ఎం.డి.ఓ. కార్యాలయం వద్ద రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం చేపట్టిన "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని బాపట్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు గారు స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తూ, ఆయా సమస్యల తీవ్రతను అక్కడికక్కడే అధికారులకు వివరించి, నిబంధనల ప్రకారం నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ:- కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగుతోందని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా నేరుగా వారి వద్దకే వచ్చి అర్జీలు స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రజా దర్బార్‌లో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 22-ఏ భూములపై డీఎల్ఎస్సీ సమీక్ష

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




బాపట్ల జిల్లా ఆగస్టు 28 : 22-ఏ కేసులు, 1954కు ముందు ఉన్న నిషేధిత జాబితా భూములకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్‌లో డీఎల్ఎస్సీ సమావేశం జరిగింది.సమావేశంలో మొత్తం 13 అంశాలను పరిశీలించారు. ఇందులో 10 అంశాలకు ఆమోదం తెలపగా, 3 అంశాలను తిరస్కరించారు.భూముల రికార్డులు, నిషేధిత జాబితా నుంచి తొలగింపునకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో జేసీ భావన, డీఆర్వో లవన్న, ఏడీ సర్వేయర్ శేషగిరి, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, చీరాల ఆర్డీవో నరసింహారావు, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సతీష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# రూ.100 కోట్లతో ఒంగోలు సమీపంలో రాడిసన్ 5-స్టార్ హోటల్

అంతర్జాతీయ ప్రమాణాలతో రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంయుక్త భాగస్వామ్యంతో నిర్మాణం

స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు

రాడిసన్ 5 స్టార్ హోటల్‌కు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన

ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ప్రముఖులు!





ప్రకాశం జిల్లా ఆగస్టు 28 : సంతనూతలపాడు ప్రకాశం జిల్లా ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాల అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో రూ.100 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న రాడిసన్ హోటల్ కు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, శాఖల మంత్రి నారా లోకేష్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంయుక్త భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ హోటల్ ను నిర్మించనున్నారు. ఒంగోలు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న తొలి 5-స్టార్ హోటల్‌గా ఇది నిలవనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న రాడిసన్ హోటల్‌లో 151 విలాసవంతమైన గదులు, మల్టీ-క్యూసిన్ రెస్టారెంట్, ప్రీమియం బార్, లాంజ్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్ పూల్, లగ్జరీ స్పా, అత్యాధునిక ఫిట్‌నెస్ సెంటర్ వంటి వసతులను కూడా ఏర్పాటు చేయనున్నారు. కార్పొరేట్ సమావేశాలు, సదస్సులు, ప్రభుత్వ కార్యక్రమాలు, వివాహాలు తదితర కార్యక్రమాల నిర్వహణకు 2,100 చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో భారీ బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లను నిర్మించనున్నారు. దీంతో ఒంగోలులో, బిజినెస్ టూరిజం కార్యకలాపాలకు మరింత ఊతమివ్వనుంది. చెన్నై--కోల్‌కతా జాతీయ రహదారి ఎన్ హెచ్ -16కు ఆనుకుని ప్రాజెక్టు ఏర్పాటు కానుండటంతో పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, పర్యాటకులకు ఈ హోటల్ ఎంతో అనుకూలంగా ఉండనుంది. ఒంగోలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టు స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత వేగాన్ని అందించనుంది. రాడిసన్ హోటల్ ఏర్పాటుతో నిర్మాణ దశతో పాటు హోటల్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగ నున్నాయి. వీటితో పాటు సమీప ప్రాంతాల్లో భవిష్యత్‌లో హోటల్ మేనేజ్ మెంట్ సంస్థల వచ్చే అవకాశం ఉంది. కార్యక్రమం అనంతరం తనని చూసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరితో ఫోటో దిగి ఆత్మీయంగా మంత్రి నారా లోకేష్ పలకరించారు. కార్యకర్తల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ గ్రూప్ చైర్మన్ రవి శంకర్, మంత్రి బాల శ్రీ వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు విజయ్ కుమార్, ఏలూరి సాంబశివరావు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ శ్రీకాంత్, కలెక్టర్ రాజాబాబు, టూరిజం ఏపీ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ యాదవ్, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఏపీ కల్చరల్ కమిషన్ చైర్మన్ పొడపాటి తేజస్వి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యం, మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ, రవిశంకర్ గ్రూప్ సిబ్బందిలు, పాల్గొన్నారు.

# తెనాలిలో ఒక నెల - ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు కార్యక్రమం

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్,

జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ నేతృత్వంలో ఘనంగా 'ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు' కార్యక్రమం!




గుంటూరు జిల్లా ఆగస్టు 28 : ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మరియు స్థానిక శాసన సభ్యులు నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ నేతృత్వంలో తెనాలిలో మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మరియు స్థానిక శాసన సభ్యులు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమం ద్వారా ఒక సువర్ణ అవకాశాన్ని ఇచ్చిందన్నారు. సమస్యలు లేని సమాజాన్ని నెలకొల్పాలని ముఖ్యమంత్రి ఆశయం అన్నారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా యంత్రాంగం సంకల్పించిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయుటకు, వాటి పట్ల అవగాహన కల్పించుటకు ఇది ఒక మంచి వేదిక అన్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వం వెళ్ళి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించుటకు అవకాశం కలుగుతుందన్నారు. నియోజక వర్గం స్థాయిలోనే నెలకు నాలుగు సార్లు అధికారులు సందర్శించడం వలన ప్రజలు స్థానికంగానే అర్జీల పరిష్కారం వివరాలు సైతం తెలుసుకునే అవకాశం ఉందని చెప్పారు. ప్రజల అర్జీలకు వారి సమక్షంలోనే నాణ్యమైన పరిష్కారం కూడా లభిస్తుందన్నారు. ఇప్పటికే ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించడమే కాకుండా సంబంధిత శాఖల అధికారులు నేరుగా అర్జీదారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. తెనాలి ఆర్.టి.ఓ కార్యాలయానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి తెనాలిలో రవాణా శాఖకు స్థలం కేటాయించాలని ప్రాంతీయ రవాణా అధికారి కె.శ్రీహరి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రిని నాదెండ్ల మనోహర్ కు విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ రవాణా అధికారి సమర్పించిన ప్రతిపాదనలను తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారికి అందజేస్తూ తగు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. లభ్యంగా ఉన్న ప్రభుత్వ భవనాలు గుర్తించాలని తెనాలి మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, ఆర్.టి.ఓ కె శ్రీహరి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె పార్థసారధి, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ లు సి.హెచ్.రమేష్, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి.సత్యనారాయణ, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు, తెనాలి తహసిల్దార్ గోపాల కృష్ణ, తెనాలి నియోజకవర్గ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు -- క్రీడలు ముద్దు పై భారీ ర్యాలీ

అమరావతి ఛాంపియన్‌షిప్ -- గ్రామీణ ప్రతిభకు రాష్ట్రస్థాయి వేదిక

65% ప్రభుత్వ విద్యార్థులు -- 80% గ్రామీణ యువత క్రీడల్లో మెరిసిన వేళ

సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విజయవంతమైన పోటీలు

డ్రగ్స్ వద్దోయ్ బ్రో' -- యువతతో భారీ అవగాహన ర్యాలీ

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధనలో భాగస్వామ్యం

సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో క్రీడాకారుల పాత్ర

:శాప్ చైర్మన్ రవి నాయుడు

విద్యార్థులు, యువత క్రీడలు, విద్య, సృజనాత్మకత వైపు దృష్టిసారించాలి

12 వేల మందికి గంజాయి ర్యాపిడ్ టెస్టులు -- 445 మందికి కౌన్సెలింగ్

:జిల్లా ఎస్ పి ఎల్. సుబ్బారాయుడు






తిరుపతి జిల్లా ఆగస్టు 28 : క్రీడల ద్వారా గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు మరియు ప్రభుత్వ విద్యా సంస్థల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే అమరావతి ఛాంపియన్‌షిప్ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.

శుక్రవారం డ్రగ్స్ వద్దు బ్రో . . డ్రగ్స్ వద్దు -- క్రీడలు ముద్దు నినాదంతో స్థానిక తారకరమా స్టేడియం నుండి ఎన్ టి ఆర్ విగ్రహం వరకు నిర్వహించిన భారీ ర్యాలీ ని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడుతో కలసి జిల్లా కలెక్టర్ ప్రారంభించగా, శాప్ ఎండీ భరణి, అడిషనల్ ఎస్పి లు, హాకీ క్రీడాకారిణి రజనీ, భారీ సంఖ్యలో అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడాకారులు, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో పై ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా 12 క్రీడా విభాగాల్లో అండర్--17, అండర్--23 వయో విభాగాలకు చెందిన క్రీడాకారుల కోసం నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తిరుపతికి తీసుకువచ్చి పోటీలు నిర్వహించామన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 15 వేల మంది క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారన్నారు. పోటీలలో పాల్గొన్న వారికి మెరుగైన బస, భోజన వసతులు కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగం శాప్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అన్ని పోటీలను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలు, గాయాలు చోటుచేసుకోకుండా క్రీడాకారులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

అమరావతి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న వారిలో సుమారు 65 శాతం మంది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు కాగా, 80 శాతానికి పైగా క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారేనని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను గుర్తించి వారికి తదుపరి స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు అమరావతి ఛాంపియన్‌షిప్ ఒక అరుదైన వేదికగా నిలిచిందన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపించేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.

యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా అండర్--17, అండర్--23 వయసు క్రీడాకారులు తమ తోటి విద్యార్థులు, యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాల పై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసు శాఖ, శాప్ ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి 'డ్రగ్స్ వద్దోయ్ బ్రో', 'డ్రగ్స్ వద్దు -- క్రీడలు ముద్దు', 'డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' అనే నినాదాలతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాల పై కఠినంగా కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ మూడు మార్గాల్లో సమగ్రంగా చర్యలు చేపడుతూ తిరుపతి జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29న తిరుపతిలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. తిరుపతి వేదికగా ప్రారంభమైన ఈ క్రీడా సంబరాలను రానున్న సంవత్సరాల్లో మరింత పెద్ద ఎత్తున నిర్వహించేలా శాప్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

శాప్ చైర్మన్ మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్‌షిప్‌లో నాలుగు రోజుల పాటు ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు కేవలం పోటీలతోనే కాకుండా సామాజిక బాధ్యతతో కూడిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, ఫిట్‌నెస్‌కు ప్రతీకలుగా యువతకు ఆదర్శంగా నిలుస్తూ, సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు, చట్టపరమైన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో క్రీడాకారులు తమ మద్దతు అందించారన్నారు. 'డ్రగ్స్ వద్దు -- క్రీడలు ముద్దు', 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జిల్లా ఎస్ పి మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పిలుపునిచ్చారు. మత్తుపదార్థాల వినియోగం, విక్రయం లేదా సంబంధిత సమాచారం ఉంటే వెంటనే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేకంగా మొబైల్ యూనిట్‌ను ఏర్పాటు చేసి విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 12 వేల మందికి గంజాయి ర్యాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా, 445 మందిని పాజిటివ్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. పాజిటివ్‌గా గుర్తించిన వారికి కేవలం కేసులు నమోదు చేయడం మాత్రమే కాకుండా అవసరాన్ని బట్టి కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

# మహిళా భక్తులతో కిక్కిరిసిన

## చందోలు శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయ ప్రాంగణం!



బాపట్ల చందోలు, ఆగస్టు 28: శ్రావణమాస పౌర్ణమి శుక్రవారం సందర్భంగా ప్రసిద్ధిగాంచిన బాపట్ల జిల్లా చందోలు శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానం భక్తులతో కిక్కిరిసింది. ముఖ్యంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి, శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో దేవస్థానం ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన ప్రత్యేక సామూహిక కుంకుమార్చన కార్యక్రమానికి మహిళా భక్తులు అశేష సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ సామూహిక కుంకుమ పూజ ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. కుంకుమార్చనలో పాల్గొన్న ప్రతి మహిళకు దేవస్థానం తరఫున అమ్మవారి చిత్రపటం, పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, పండ్లు, పూలు తదితర



పూజా ద్రవ్యాలను ఉచితంగా అందజేసినట్లు ట్రస్ట్ బోర్డు సభ్యులు వక్కలగడ్డ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కలకోట చక్రధర్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి జి. నరసింహమూర్తి మాట్లాడుతూ, తొలిసారిగా నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమానికి విశేష స్పందన లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన మహిళా భక్తులందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తకోటికి అభినందనలు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం, ప్రసాద పంపిణీ, పూజా కార్యక్రమాలు, ఇతర అవసరమైన సౌకర్యాలను క్రమబద్ధంగా ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ భక్తులకు అవసరమైన సేవలను అందించారు. శ్రావణమాస పౌర్ణమి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తి సంద్రంగా మారింది.

# గంజాయి రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




బాపట్ల జిల్లా ఆగస్టు 28: జిల్లాను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో మాదకద్రవ్యాల ప్రభావం లేకుండా చూడాల్సిన బాధ్యత అన్ని శాఖలపై ఉందన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1972కు ఫోన్ చేసి తెలియజేయాలని ప్రజలకు సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, విద్య, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. నిరంతర తనిఖీలతో పాటు అవగాహన సదస్సులను మరింత పెంచాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో అదనపు ఎస్పీ సుధాకర్, చీరాల, బాపట్ల, రేపల్లె డీఎస్పీలు మొయిద్దీన్, చంద్రమౌళి, అజీజ్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాససింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పద్మావతి, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం

పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీ

సీఎం చంద్రబాబు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సారథ్లో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు

పట్నం బజార్ ను మరింత వ్యాపార కేంద్రంగా మారుస్తాం

స్థానిక సంస్థల్లో కూటమికి మద్దతు ద్వారా నగర ప్రగతి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు ఆగస్టు 28: నగరంలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉన్న పట్నం బజారు ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని వడ్డెర గూడెంలో 60 లక్షలు బండ్ల నగర్ లో 28 లక్షలు, బాలాజీ నగర్ లో 48 లక్షలు జియావుద్దీన్ కాలనీలో రూ. 45 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పైపులైన్ల నిర్మాణానికి ల ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాయణ లోకేష్ నాంది పలికారని తెలిపారు, ఇప్పటికే రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. గూగుల్, క్వాంటం వ్యాలీ వంటి ప్రముఖ సంస్థలు ఆంధ్రప్రదేశ్ కు క్యూ కట్టేలా చేశారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి ప్రముఖ కంపెనీలను తరిమికొట్టారని విమర్శించారు. పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రాన్ని పరిశ్రమలకు స్వర్గధామంగా మార్చారని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూనే వ్యాపార రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను బలపరచడం ద్వారా నియోజకవర్గంలో మరింత అభివృద్ధి సాధించుకోవచ్చున్నారు. ఒకే దేశం, ఒకే నాయకత్వం ద్వారా గొప్ప ప్రగతి సాధ్యపడుతుందని దేశంలో ప్రధాని మోదీ నాయకత్వం, రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో చల్లా ఆంజనేయ ప్రసాద్, చిన్న బుజ్జి, తాడిబోయిన చిరంజీవి, మీరా, రఫీ, ఖాసిమా, చైతన్య, సూరె శ్రీను, మల్లెంపూడి శ్రీను, సూరం లక్ష్మి, షాజహాన్, నయీముద్దీన్, బ్రహ్మసాని శ్రీను, గోపి, దొడ్డి నాగరాజు, యార్ల గురవయ్య, శ్రీలక్ష్మి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలులో రాడిసన్ రవిప్రియ హోటల్‌కు భూమిపూజ

## మంత్రి నారా లోకేష్‌తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి



ప్రకాశం జిల్లా ఆగస్టు 28 : ఒంగోలులో ప్రతిష్ఠాత్మక రాడిసన్ రవిప్రియ హోటల్ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌తో కలిసి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి లోకేష్‌తో కలిసి ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక పూజలు నిర్వహించి హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒంగోలు నగరంలో ప్రముఖ హోటల్ నిర్మాణం చేపట్టడం ద్వారా పర్యాటక, వాణిజ్య రంగాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హోటల్ యాజమాన్యానికి ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు తెలిపారు. రాడిసన్ వంటి అంతర్జాతీయ స్థాయి హోటల్ ఏర్పాటుతో ఒంగోలు నగరానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయ స్థలంలోని ఆక్రమణలను తొలగించాలి

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ప్రజా గ్రీవెన్స్‌లో అర్జీ అందజేత!
- బాపట్ల నియోజకవర్గ ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే వేగేశన
- జాయింట్ కలెక్టర్ భావన వశిష్టలకు వినతిపత్రం సమర్పించిన ట్రస్ట్ బోర్డు సభ్యులు!
- ఆలయ స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణలు తొలగించడంతో పాటు, నివసిస్తున్న వారికి మానవతా దృక్పథంతో ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి!
- ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించి, దేవాదాయ శాఖాధికారి నాగయ్య ద్వారా వివరాలు తెలుసుకుని తహసీల్దార్‌కు తగిన ఆదేశాలు జారీ చేసిన జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట



బాపట్ల జిల్లా చందోలు పిట్టలవానిపాలెం మండలం, ఆగస్టు 28 : బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల దినోత్సవం (ప్రజా దర్బార్) లో చందోలు గ్రామానికి చెందిన చారిత్రక ప్రాధాన్యత గల శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థాన అంశం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆలయానికి చెందిన పవిత్ర భూములు ఆక్రమణల పాలవడంతో భక్తులకు కనీస వసతులు కల్పించడం కష్టమౌతోందని, తక్షణమే ఆక్రమణలను తొలగించి ఆ భూములను దేవస్థానానికి అప్పగించాలని కోరుతూ ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు భక్తులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్టల సమక్షంలో ఈ అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు సభ్యులు మాట్లాడుతూ, ఆలయానికి నలువైపులా ఉన్న విశాలమైన స్థలాలు ఆక్రమణకు గురికావడంతో పుణ్యక్షేత్రానికి వచ్చే వేలాది మంది భక్తులకు అవసరమైన కనీస సదుపాయాలు, క్యూ లైన్లు, విశ్రాంతి గదుల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ దేవాదాయ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి, ఆక్రమణలు నిర్ధారణ అయిన వెంటనే వాటిని తొలగించి ఆలయ అవసరాలకు కేటాయించాలని కోరారు. అదే సమయంలో, ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న నిరుపేద ఆక్రమణదారుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి వారికి ప్రభుత్వం తరఫున ప్రత్యామ్నాయ నివేశన స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేయడం విశేషం. ప్రజా దర్బార్‌లో అందిన ఈ ఫిర్యాదుపై జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట వెంటనే సానుకూలంగా స్పందించారు. అక్కడే ఉన్న జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎం. నాగయ్యను పిలిచి, ఆలయ ఆస్తులు ఆక్రమణలకు సంబంధించిన పూర్తి వివరాలను కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ఈ అంశంపై క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదిక అందించాలని పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్‌ను ఫోన్ ద్వారా ఆదేశించారు. అలాగే, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, నిబంధనలకు లోబడి దేవస్థాన భూములను పరిరక్షించడంతో పాటు బాధితులకు తగిన న్యాయం జరిగేలా చూస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ట్రస్ట్ బోర్డు సభ్యులు తెలిపారు. రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతున్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయాన్ని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు భక్తులకు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జి. నరసింహమూర్తి, ట్రస్ట్ బోర్డు సభ్యులు, స్థానిక కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆర్థిక అసమానతలు తొలగించి, పేదలకు మెరుగైన సేవలు..

జీవన ప్రమాణాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన!

ఆర్థిక స్వావలంబనపై దృష్టి పెట్టాలని సూచించిన

జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్.వి!



బాపట్ల జిల్లా ఆగస్టు 28: ఆర్థిక అసమానతలు తొలగించడం, పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పి4, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అమలు తీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, విజన్ యూనిట్ సభ్యులతో రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి శుక్రవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరి తలసరి ఆదాయం మెరుగుపడాలి, సంపద పెరిగితేనే పేదరికాన్ని నిర్మూలించగలమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అప్పుడే రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ, సంక్షేమం అందరికీ అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. సమస్య పరిష్కారానికి అన్వేషణ ముఖ్యం, తద్వారా పరిష్కారంతోపాటు మెరుగైన సేవలు అందించగలమన్నారు. విజన్ 2047 లక్ష్యంతో స్వర్ణ నియోజకవర్గ విజన్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విజన్ యూనిట్ సభ్యులు, అసోసియేట్ ప్రొఫెసర్లు చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రభుత్వానికి, పరిపాలన వ్యవస్థకు మరింత గౌరవం లభిస్తుందన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండటానికి ఇదొక మార్గమని ఆయన సూచించారు. సృజనాత్మకతతో పనిచేయండి, సంపద సృష్టిలో భాగస్వాములు కావాలని మార్గనిర్దేశం చేశారు. వ్యవసాయ రంగంలో ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యత కల్పించడం ద్వారా ఉత్పత్తులు పెరుగుతాయి. తక్కువ పెట్టుబడితో లాభసాటి వ్యవసాయంగా మారుతుందన్నారు. ప్రజల సానుకూల స్పందన స్థాయిని బాగా పెంచాలన్నారు. పోటీతత్వం, స్ఫూర్తిగా చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన వివరించారు. భూమిని పచ్చగా ఉంచితే వాతావరణం మెరుగుపడుతుంది, అదేసమయంలో ఎల్ నినో నుంచి తప్పించుకోగలమన్నారు. ఆ దిశగా వినూత్నమైన ఆలోచనల వైపు అడుగులు వేయాలి, మీరంతా కలిసి పనిచేయాలని సూచనలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిలో పేద కుటుంబాల అభివృద్ధిపై ప్రమాణాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలలోని బంగారు కుటుంబాల ఆర్థిక స్వావలంబనపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వీక్షణ సమావేశం అనంతరం అధికారులతో ఆయన సమీక్షించారు. సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి సిపిఓ షాలేము రాజు, డి ఆర్ డి ఏ పి డి బి సింగయ్య, మెప్మా పిడి ఆనంద సత్యపాల్, స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్చార్జి అధికారి రాజేష్, కోఆర్డినేటర్ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు పనితీరుకు ప్రామాణికం

విజన్ ప్లాన్ పై ప్రజా ప్రతినిధులు నిరంతరం సమీక్షించాలి

ప్రజల భాగస్వామ్యం తోనే మెరుగైన ఫలితాలు

అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ ఉండాల్సిందే

నియోజకవర్గ విజన్ ప్లాన్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు

నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి సమీక్ష

ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్




గుంటూరు జిల్లా ఆగస్టు 28 : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం, సుపరిపాలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేలు, యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్స్ తో సీఎం మాట్లాడారు. నియోజక వర్గాల వారీగా విజన్ ప్లాన్ రూపొందించుకుని పని చేయడం దేశంలోనే ప్రథమంగా ఏపీలోనే అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి జాతీయ స్థాయిలో మంచి పేరు వచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో నియోజకవర్గాల విజన్ ను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలది కీలక పాత్ర అని చెప్పారు. రూపొందించుకున్న కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ఆయా రంగాల్లో వృద్ధి నమోదు చేసేలా పని చేయాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గాల విజన్ ప్లానులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని... ఆ మేరకు వీళ్లంతా వినూత్నంగా ఆలోచించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం... ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలపై ఫోకస్ పెట్టాలని సూచించారు. స్థానికంగా ఉండే వనరుల లభ్యతను ఆధారంగా చేసుకుని ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నియోజక వర్గాల విజన్ ను అందించామని, ఆయా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు డేటా లేక్ సిద్ధం చేశామని... అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించుకోవడంతోపాటు.. పూర్తి స్థాయిలో టెక్నాలజీని వినియోగించుకోవాలని సీఎం ఆదేశించారు. నియోజకవర్గాల యాక్షన్ ప్లాన్ అమలుపై ఎమ్మెల్యేలు ఎప్పటి కప్పుడు సమీక్షలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్ర స్థాయిలో సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులకు కేవలం నగదు సాయం అందించడమే కాకుండా, వారిని ఆర్థికంగా నిలబెట్టి సాధికారత వైపు నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి-సంక్షేమం చేపడుతోందని..వాటిని ప్రజలకు వివరించే బాధ్యతను ప్రజా ప్రతినిధులే తీసుకోవాలని అన్నారు. పీ4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. పేదరిక నిర్మూలనకు పారిశ్రామికవేత్తలను సైతం ప్రోత్సహిస్తూ, సమాజంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగించాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గాల్లోనూ తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అలాగే అనుమతులు పొందుతున్న పరిశ్రమలు ఆయా జిల్లాల్లో, నియోజకవర్గాల్లో గ్రౌండ్ అయ్యే విధంగా ప్రజా ప్రతినిధులు, క్షేత్ర స్థాయి అధికారులు..సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెరిగేలా ఇప్పటికే 1.50 కోట్ల ఆన్లైన్ కోర్సులు కూడా పూర్తి చేసుకున్నారని సీఎం తెలిపారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ యూనిట్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని సీఎం అన్నారు.

**వినూత్నంగా ఆలోచించాలి... మెరుగైన సేవలు అందించాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారుతున్నాయని, ఈ ఇబ్బందుల నుంచి వారిని గట్టెక్కించేందుకే సంజీవని, తల్లికి వందనం వంటి వినూత్న పథకాలను తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై విద్యా భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే అధికారులు, ప్రజా ప్రతినిధులు సాంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ప్లాన్‌ను వర్తింపజేస్తూ సమస్యలకు తగిన పరిష్కారాలు చూపాలని కోరారు. పరిపాలనలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం అత్యంత కీలకమని, అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలు కావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల్లోనూ, అభివృద్ధి కార్యక్రమాల్లోనూ ప్రజలను భాగస్వాములను చేసినప్పుడే అద్భుత ఫలితాలు వస్తాయని సీఎం అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల కలల సాకారంగా చేపట్టిన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరుతో కార్యక్రమం నిర్వహిస్తే.. ప్రజలే స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి ప్రచారం చేపట్టారని గుర్తు చేశారు. అదే విధంగా యువతకు, నిరుద్యోగులకు మేలు చేసేలా చేపట్టిన మెగా డీఎస్సీ ప్రక్రియకు అనేక అడ్డంకులు కల్పించే ప్రయత్నం జరిగినా సమర్థవంతంగా నిర్వహించి రిక్రూట్మెంట్ పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా చేపట్టిన మెగా డీఎస్సీపై విమర్శలు చేస్తుంటే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలను మెప్పించగలిగితే... ప్రజల నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం చెప్పారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు, ముఖ్యమంత్రి సూచనలు, మార్గదేశాలకు అనుగుణంగా నిజమైన స్ఫూర్తికి దర్పం పట్టే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

APTEL/26/A4813
శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త



# గుంటూరు ఛానల్ పూర్తి చేసే బాధ్యత నాదే

పర్చూరు వరకు పొడిగింపుపై రాజీ లేదు

28 వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



బాపట్ల జిల్లా పర్చూరు ఆగస్టు 28 : గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ఏడు దశాబ్దాల కలను సహకారం చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఛానల్ విస్తరణతో నియోజకవర్గంలోని సుమారు 28 వేల ఎకరాలకు సాగునీటితో పాటు ప్రజలకు తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ,ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు తీసుకురావడం ద్వారా రైతులకు శాశ్వతంగా నీటి భరోసా కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో రైతులు అపోహలకు గురికావద్దని ఎమ్మెల్యే ఏలూరి స్పష్టం చేశారు.

# మార్టూరు చెరువులను సుందరంగా తీర్చిదిద్దాలి

వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగించాలి

సాగర్ జలాలతో రెండు చెరువులను నింపాలి..

నీటి కొరత లేకుండా చర్యలు..డీఎంఎఫ్ నిధులతో ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టాలి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



బాపట్ల జిల్లా ఆగస్టు 28 : మార్టూరు పట్టణంలోని చెరువులను సాగర్ జలాలతో నింపి నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మార్టూరులోని చెరువులను ఆయన పరిశీలించారు. చెరువుల పరిస్థితి, నీటి లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు చెరువులను సాగర్ జలాలతో నింపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. చెరువుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.మార్టూరు ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి అధికారులకు స్పష్టం చేశారు. డీఎంఎఫ్ నిధులతో ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఓటర్ల సవరణ దరఖాస్తులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ ఆదేశం!



బాపట్ల జిల్లా ఆగస్టు 28 : సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా తయ్యారికి సంబంధించి హియరింగ్ పెండింగ్ లేకుండా పది రోజులలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం రాత్రి సర్, సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా తయ్యారికి సంబంధించి ఆర్డీఓ లు,మున్సిపల్ కమిషనర్లు, ఈ ఆర్ ఓ లు,ఏ ఈ ఆర్ ఓ లు,బి యల్ ఓ లతో జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వి సి హల్ నుండి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా తయ్యారికి సంబంధించి హియరింగ్ పది రోజులలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 48 మంది ఈఆర్ఓ, ఏఈఆర్వోలు ఉన్నారని, వారి లాగిన్ లో ఉన్నటువంటి దరఖాస్తులను పూర్తి చేయుటకు రెండు విభాగాల ద్వారా ( ఉదయం మరియు రాత్రి ) ఇద్దరిద్దరు ఉద్యోగులకు విధులు కేటాయిస్తూ,వారికి శిక్షణ ఇచ్చి లాగిన్ లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 159116 మందికి నోటీసులు పంపడం జరిగిందని తెలిపారు. నోటీసుల జారీ, హియరింగ్ లకు సంబంధించి ఏ ఈ ఆర్ ఓ, బి ఎల్ ఓ వారీగా పెండింగ్ లేకుండా చూడాలని, పెండింగ్ గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏ ఈ ఆర్ ఓ లు ప్రతి రోజు 250 హియరింగ్ పూర్తి చేయాలని, బి యల్ ఓ లాగిన్ నుండి వచ్చిన వెంటనే ఏ ఈ ఆర్ ఓ లు క్లియర్ చేయాలని ఏ ఈ ఆర్ ఓ లను ఆదేశించారు. 24 గంటలలో తక్కువ చేసిన పి వి పాలెం మండలంలో తక్కువ చేయడానికి కారణాలు ఏమిటిని కలెక్టర్ తెలుసుకున్నారు. సంకీర్త ఓటర్ల సవరణ లో ఏమైనా సందేహాలు సమస్యలు ఉంటే వాటిని వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ వి సి హల్ నుంచి డి పి ఓ.యల్.ప్రభాకర్ రావు, కోఆర్డినేషన్ సెక్షన్ పర్యవేక్షకులు షఫి, తదితరులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



పలమనేరు ఆగస్టు 28 :టెట్ రద్దు కోసం పలమనేరులో యు.టి.ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ క్రింది డిమాండ్లను పరిష్కరించాలని కోరడమైనది. ప్రధాన డిమాండ్లుఇన్ సర్విస్ టీచర్లకు టెట్ రద్దు కోసం ప్రయత్నించాలి. ఆర్. టి. ఈ లోని 23(1) చట్టాన్ని సవరించాలి.స్పెషల్ టెట్ నిబంధనలను సవరించాలి.ఇన్ సర్వీస్ టీచర్లకు అర్హత మార్కులను తగ్గించాలి.బోధనా సబ్జెక్టులోనే పరీక్ష నిర్వహించాలి.టెట్ పరీక్షలు ఆఫ్ లైన్ లో నిర్వహించాలి.పాల్గొన్న నాయకులుజీవి రమణ, రాష్ట్ర కార్యదర్శి కె. రెడ్డెప్ప నాయుడు,జిల్లా అధ్యక్షులు, ఎన్. మణిగండన్, జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా కార్యదర్శులు పీసీ బాబు,ఎం. శ్రీనివాసులు, ఎన్. శశికుమార్, జిల్లా మహిళా కన్వీనర్ మంజులా రాణి,సోషల్ మీడియా కన్వీనర్ ఎం. మోహన్,ఏ. కృష్ణ మూర్తి, ఎం సి నిర్మల,వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. భాస్కర్, సాలెహ, ఎం. యుగంధర్, శంకర్ రెడ్డి, రామమోహన్,హరిప్రసాద్, శ్రీనివాసులు,టైగర్ మోహన్, చంద్రశేఖర్,కుమార్ వివిధ మండలాల నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా గాండ్ల కులస్థులచే జంధ్యాలు పండుగ



పలమనేరు ఆగష్టు 28: పలమనేరు పట్టణలోని గాండ్ల సంక్షేమ సేవా సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో శ్రావణమాసపు పవిత్ర జంధ్యాలు పండుగ (ఆవని ఆవిట్టం) జరుపుకొన్నారు. స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం నందు నూతన జంధ్యాల ధారణ కార్యక్రమం మాజీ ఎంపిపి ఆర్.రాజేంద్రన్ ఆధ్వర్యంలో జరుగగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం జరిపారు.పట్టణ పాతపేట నందలి పెద్ద గాండ్ల వీధి వినాయకుని ఆలయం నుండి కులస్థులు అందరూ కలసి చిన్న గాండ్ల వీధి భజనగుడి, శ్రీపతిరావువీధి,వేణుగోపాలస్వామి ఆలయం,శ్రీ సత్య గంగమ్మ గుడి మీదుగా మేళతాళాలతో ఊరేగింపుగా శివాలయం చేరుకొన్నారు.ఆలయంలో జంధ్యాల ధారణ మహోత్సవమును పురోహితులు కిషోర్ స్వామి నేతృత్వంలో మంత్రోచ్చారణలు నడుమ సాంప్రదాయం ప్రకారం కొనసాగించారు.అనంతరం చక్కటి బాక్స్ లలో ప్రసాద వితరణలు చేశారు.ఈ కార్యక్రమం నిర్వహించడంలో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక చలువ పందిళ్ళు, ప్రతి ఒక్కరికీ అవసరమైన ఏర్పాట్లు చేసి నిర్వాహకులు కులస్థులచే మన్ననలు పొందారు.కార్యక్రమం నిర్వాహకులుగా ఆర్.అమరేంద్ర బాబు,టి.కె. షణ్ముగం,ఆర్. మురళీ కృష్ణ,పి.కె.ఎం. సుబ్రహ్మణ్యం,కోదండ రామ్మయ్య, ఎ. ఆర్.కుమార్,బాలు, కేశవులు,గణేష్,రాజేష్ లు వ్యవహరించగా సుమారు 500మంది గాండ్ల కులస్థులు పాల్గొని తమ సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఐక్యతను చాటారు.

# ఎస్సీ, ఎస్టీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి..

జిల్లా కలెక్టర్ డా. వినోద్‌కుమార్.వి ఆదేశం!



బాపట్ల జిల్లా ఆగస్టు 28 : సమాజంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లో వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు లేవనెత్తిన సమస్యల పరిష్కారంపై పురోగతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్. వి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. సదరు సమస్యలపై అధికారులు తీసుకున్న నిర్ణయాలను వారు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు లేవనెత్తిన పలు సమస్యలను ఆయన సావధానంగా విన్నారు.వేటపాలెంలో బాలికల ఆశ్రమ పాఠశాల మరియు బాలుర ఎస్టీ గురుకులంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి జిల్లా విద్యాధికారి (డీఈఓ) నుండి అవసరమైన నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) పొందాలన్నారు. చీరాల మండలం, బుర్లవారిపాలెం మరియు కారంచేడు మండలం స్వర్ణ గ్రామం కాలువ కట్టలపై నివాసం ఉంటున్న ఎస్.టి గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సభ్యులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ స్పందించి విద్యుత్ శాఖ అధికారులను వెను వెంటనే ఆయా కుటుంబాలకు సోలార్ టార్చ్ లను అందజేయాలని ఆయన ఆదేశించారు. ఎస్. టి కుటుంబాలకు ప్రభుత్వం నిబంధనల మేరకు ప్రభుత్వ భూమిలో ఇళ్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎస్టిలకు ఓటు హక్కు విషయంలో నోటీసులు వచ్చి ఉంటాయని, వారు అధైర్య పడకుండా సభ్యులు అవగాహన కల్పించి రెవెన్యూ అధికారులు వారి వద్దకు వచ్చినప్పుడు, వారి వద్దగల ఏదేని ధృవీకరణ పత్రమును చూపించి ఓటు హక్కును పొందాలన్నారు. పారిశుధ్య కార్మికులకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, వారికి ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అన్ని మండల స్థాయి అధికారులకు తెలిపారు. ఒప్పంద కార్మికులకు పునరావాసం ఏర్పాటు, వారికి బ్యాంక్ ఖాతాలు ఏర్పాటు చేసి, ఆ ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమం రాష్ట్రంలో బాపట్ల జిల్లాలోనే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి తెలిపారు. దళితులకు పరిహారం కింద అందజేసిన భూములను 22 ఏ నుండి తొలగించుటలో అసలైన లబ్ధిదారులు ఆ భూములలో ఉండటం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి సభ్యులకు తెలిపారు. ప్రభుత్వం నిబంధనలు మేరకు ఆ భూములను లబ్ధిదారులు అనుభవిస్తున్నయడల 22 ఏ నుండి తొలగించుటకు అవకాశం కలదని, ప్రస్తుతం ఆ భూములలో వేరే వాళ్ళు ఉండటం వల్ల 22 ఏ నుండి తొలగించుటకు వీలుపడదని, సభ్యులు ఈ విషయమై మరోసారి విచారణ జరిపి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుధాకర్, ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, కమిటీ సభ్యులు, ఇతర జిల్లా అధికారులు, బాపట్ల చీరాల రేపల్లె డిఎస్పీలు, ఎస్సీ, ఎస్టీ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ జలాలతో చెరువులన్నీ నింపాలి

ఒకటో తేదీ నాటికి నియోజకవర్గానికి నాగార్జునసాగర్ నీరు

ఎన్ఎస్‌పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కృష్ణా వెస్టన్ డెల్టా పరిధిలోనూ నీటి నిల్వలు ఉండేలా చర్యలు

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి



బాపట్ల జిల్లా ఆగస్టు 28 : మార్టూరు నాగార్జునసాగర్ జలాలను నియోజకవర్గంలోని అన్ని చెరువులకు చేరేలా పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు ఒకటో తేదీ నాటికి నియోజకవర్గానికి సాగర్ జలాలు చేరేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడా నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

నియోజకవర్గంలో తాగునీటి పరిస్థితిపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్ఎస్‌పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. సాగర్ నుంచి వచ్చే నీటిని ప్రాధాన్యత క్రమంలో చెరువులకు మళ్లించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని సాగర్ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. కాలువల ద్వారా నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాగర్ జలాలను ప్రథమంగా మంచినీటి అవసరాలకే వాడాలన్నారు. చెరువులు, కుంటలకు నీరు చేరే మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, నీరు వృథాగా పోకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత, కాలువల పరిస్థితి, చెరువుల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలన్నారు.

కృష్ణా డెల్టా చెరువులపై దృష్టి

కృష్ణా వెస్టన్ డెల్టా పరిధిలోని అన్ని చెరువుల్లోనూ తగినంత నీటి నిల్వలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు డీఈ ప్రసాద్‌ను ఆదేశించారు. సాగర్ జలాల వినియోగంతో పాటు డెల్టా పరిధిలోని చెరువుల నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సాగు అవసరాలను సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామానికి నీరు అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏ ప్రాంతంలోనూ నీటి ఎద్దడి సమస్య రాకుండా అధికారులు ముందస్తు కార్యాచరణతో వ్యవహరించాలని సూచించారు. చెరువుల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి, ఎన్ ఎస్ పి ఈ ఈ సతీష్, డి ఈ జయ శంకర్ రావు,. కే డబ్ల్యు డి ఈ ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ సతీష్ నాయకులు మురళీకృష్ణ, దిలీప్, ఏఈ లు బాలకృష్ణ,శ్రీధర్, కార్తీక్ , బ్రహ్మయ్య, శివ నాగరాజు , చైతన్య , లోకేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# సోదరభావానికి ఐక్యతకు ప్రతీక రాఖీ పౌర్ణమి

వాసుపల్లి కార్యాలయంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



విశాఖపట్నం, ఆగష్టు 28, : నగరంలోని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్, కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు, అభిమానులు వాసుపల్లి గణేష్ కుమార్ కి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ కలిసి ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ, మహిళల రక్షణ, సాధికారత కోసం తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. రాఖీ పౌర్ణమి సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తుందని అన్నారు.ఈ వేడుకల్లో రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. వాసుపల్లి కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ పద్మనాభ అమ్మాజీ, పత్చిరిపిల్లి లక్ష్మి, స్టేట్ మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ షబీర బేగం, స్టేట్ అంగన్వాడి వింగ్ జనరల్ సెక్రెటరీ సలాది భాను,సౌత్ మహిళా ప్రెసిడెంట్ వాసుపల్లి బంగారమ్మ, సౌత్ వాలంటరీ విభాగం ప్రెసిడెంట్ కడవల నాగమణి,జిల్లా మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ నీలపు లక్ష్మి,వార్డ్ మహిళా ప్రెసిడెంట్స్ చెలపల్లి జ్యోతి, రోజా, రమణి,గాలి పార్వతి,వలిశెట్టి లక్ష్మి, ఝాన్సీ, అన్నపూర్ణ నాయిర్,చుక్కా ఈశ్వరి, కోసేట్టి దేవి,మణి, మీనా, బుర్రలు అరుణా,జ్యోతి దక్షిణ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు వార్డు అధ్యక్షుల మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనీ వాసుపల్లి కి హారతులిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ పండుగ కందుల నాగరాజు



విశాఖపట్నం, ఆగష్టు 28, : ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ పండుగ అని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్, విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు కందుల నాగరాజు అన్నారు. రాఖీ పండుగను పురస్కరించుకుని విజ్ఞాన భారతి స్కూల్ అధ్యాపకులు, స్కూల్ విద్యార్థులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా కందుల నాగరాజు మాట్లాడుతూ అనురాగం, అనుబంధం, ఆత్మవిశ్వాసం,అన్నీ సమపాళ్లలో కలిసిన బంధమే రక్తసంబంధమని చెప్పారు. ఎల్లలు లేని ప్రేమకు, వెలకట్టలేని విలువలకు ఇది ఓ చిహ్నమని పేర్కొన్నారు. కలిసిమెలిసి పెరిగినా, అల్లరి చేస్తూ గడిపినా, కష్టాల్లో తోడుగా నిలిచినా సోదర సోదరీమణుల ప్రేమ ఎప్పుడూ త్యాగాన్నే కోరుకుంటుందని వెల్లడించారు.కష్ట సుఖాల్లో కంటికిరెప్పలా కలిసిమెలిసి ఉంటున్న తోబుట్టువులందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. తోబుట్టువులకు ఇది పవిత్రమైన పండుగని చెప్పారు. ప్రతి కష్టంలో సోదరులు తోడుంటారనే విశ్వాసానికి గుర్తు అని అన్నారు. సోదర, సోదరీమణుల మధ్య అనుబంధాన్ని ఈ పండుగ గుర్తు చేస్తుందని తెలిపారు. రాఖీ అంటే రక్షణ అని అర్థం ని, సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఎల్లవేళలా అండగా, రక్షణగా ఉండాలని ఆకాంక్షిస్తారని తెలిపారు. రక్షా బంధన్ వేడుక తరతరాలుగా వస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో కందుల నాగరాజు కుటుంబ సభ్యులు నళిని దేవి,కేదార్నాథ్, బదిరీనాథ్, స్వాతి,సుప్రియ, ఎస్.కె.ఎం.ఎల్ ట్రస్టీ వేణు కుమారి, విజ్ఞాన భారతి స్కూల్ టీచర్లు, విద్యార్థులు, కె.అప్పారావు, సీపీఐ బుజ్జి,ఝాన్సీ,జానకి,మాధురీ, రమేష్ పాడి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం వీడియో కాన్ఫరెన్స్ కు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంపీడీవో కార్యాలయంలో హాజరు



పలమనేరు ఆగస్టు 28 : పలమనేరు నియోజకవర్గ పి-4 స్పెషల్ ఆఫీసర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీదేవి మండల పరిషత్ కార్యాలయం నందు జీరో పావర్టీ మిషన్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ కు హాజరు కావడం జరిగింది. అనంతరం టి. వడ్డూరు గ్రామంలో జీరో పావర్టీ మిషన్ (అత్యంత నిరుపేదల కుటుంబాలను గుర్తించుటలో) భాగంగా శుక్రవారం పలమనేరు మండలంలోని టి. వడ్డూరు గ్రామంలో గ్రామ సమాఖ్యల ద్వారా గుర్తించిన అత్యంత నిరుపేదల కుటుంబాలను పరిశీలించడం జరిగిందన్నారు . తల్లిదండ్రులు లేని పిల్లలను, ఆధార్ కార్డు లేక స్కూల్ లో చేరని వారిని ఎలాంటి ఆధారం లేని వారిని పరిశీలించడం జరిగిందన్నారు.వారికి కావలసిన సహాయ సహకారాలు అందించాలని సచివాలయ సిబ్బందికి, పి-4 సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. పి-4 స్పెషల్ ఆఫీసర్ తో బాటు వెలుగు సిబ్బంది వి.మొగిలీస్వరయ్య, ఏ.పి.యం.విజయకుమారి, సి.సి, సంఘమిత్రలు, సి.వి.ఏ.పి యూనిట్ టీం,జి.వి.యస్ సాయి కుమార్, యంగ్ ప్రొఫెషనల్, సచివాలయ స్టాఫ్ హాజరు కావడం జరిగిందన్నారు.

# హెల్మెట్ లేకుంటే చలానా తప్పదు - కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర.....

శిరోరక్షే ప్రాణరక్ష కార్యక్రమం లో అవగాహన, ముమ్మర తనిఖీలు..



బాపట్ల జిల్లా కర్లపాలెం, ఆగస్టు 28: బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు కర్లపాలెం మండల వ్యాప్తంగా పోలీసులు క్షేత్రస్థాయిలో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. శిరోరక్ష ప్రాణరక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం కర్లపాలెం ఎస్ఐ ఎస్. రవీంద్ర ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.సరైన ధృవపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాహనదారులు బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# ఫైబర్ అధికంగా లభించే ధాన్యాలు ఇవే.. వీటిని తీసుకుంటే ఎంతో మేలు..



ఆహారంలో ఉండే ఫైబర్ (ణఱవ్ఘుతీఎ ఖీఱఎతీవ) శరీరానికి ఎంతో అవసరమైన పోషక పదార్థం. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, పప్పుధాన్యాల్లో ఇది సమృద్ధిగా లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపరచడం, వ్యర్థాల తొలగింపు, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, కొలెస్ట్రాల్ తగ్గించడం, ఎక్కువసేపు తృప్తిగా ఉంచడం వంటి అనేక ప్రయోజనాలు ఫైబర్ వల్ల లభిస్తాయి. అయితే ఫైబర్ ను చాలా మంది తక్కువగా అంచనా వేస్తారని నిపుణులు చెబుతున్నారు. ధాన్యాలను ఫైబర్ పరిమాణం ఆధారంగా ర్యాంక్ చేస్తూ సరైన ఆహార ఎంపికలు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫైబర్ పరంగా ధాన్యాలు ఏయే స్థానాల్లో ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

## బల్గర్, స్టీల్-కట్ ఓట్స్, పర్ల్ బార్లీ..

ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారాల్లో మొదటి స్థానంలో బల్గర్ ఉంది. ఇది అధిక ఫైబర్ కలిగిన సంపూర్ణ ధాన్యం. జీర్ణక్రియకు సహాయపడటంతో పాటు, జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. తక్కువ క్యాలరీలతో ఎక్కువసేపు తృప్తిగా ఉంచి బరువు నియంత్రణకు దోహదపడుతుంది. సాధారణంగా ఉడికించి తింటారు, అయితే వేయించడం, బేక్ చేయడం లేదా రోస్ట్ చేయడం కూడా చేస్తారు. రెండో స్థానంలో స్టీల్-కట్ ఓట్స్ ఉన్నాయి. వీటిని ఐరిష్ ఓట్స్ అని కూడా అంటారు. ఇవి ఫైబర్, స్టార్చ్ అధికంగా ఉండటంతో బరువు తగ్గేందుకు అనుకూలం. వీటిని వండడానికి 15-20 నిమిషాలు పడుతుంది. పాయసం వంటి వంటకాలకు ఎక్కువగా ఉపయోగిస్తారు. అలాగే మూడో స్థానంలో పర్ల్ బార్లీ ఉంది. ఇది బార్లీ గింజలపై ఉన్న బయటి పొరను తొలగించిన రూపం. సూపులు, స్ట్యూలు, రిసొట్టో వంటి వంటల్లో దీన్ని ఉపయోగిస్తారు. దీని టెక్స్చర్ మృదువుగా ఉండటంతోపాటు ద్రవాలను గట్టిపరిచే గుణం ఉంది.

## క్వినోవా, వైల్డ్ రైస్, బ్రౌన్ రైస్..

తర్వాత స్థానంలో క్వినోవా ఉంది. ఇది గ్లూటెన్ లేని ప్సూడో-సిరియల్. చాలా ధాన్యాలతో పోలిస్తే దాదాపు రెట్టింపు ఫైబర్ కలిగి ఉంటుంది. జీర్ణక్రియకు మేలు చేయడంతోపాటు, పూర్తి ప్రోటీన్‌గా పనిచేసి ఆకలి నియంత్రణ, రక్త చక్కెర నియంత్రణలో సహాయపడుతుంది. ఆ తరువాత స్థానంలో వైల్డ్ రైస్ ఉంది. ఇది వాస్తవానికి ఒక గడ్డి విత్తనం. సాధారణ తెల్ల బియ్యంతో పోలిస్తే అధిక ఫైబర్, ప్రోటీన్ కలిగి ఉండటంతో పోషకంగా మెరుగైన ఎంపికగా పరిగణిస్తారు. బ్రౌన్ రైస్ కూడా మంచి ఫైబర్ ఉన్న సంపూర్ణ ధాన్యం. ఇది బరువు నియంత్రణ, గుండె ఆరోగ్యం, రక్త చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. అలాగే పారా బాయిల్డ్ రైస్ అనేది ప్రాసెసింగ్‌కు ముందు గింజను కొంతవరకు మరిగించడం ద్వారా తయారు చేసే బియ్యం. ఈ ప్రక్రియ వల్ల దాని పోషక విలువలు కొంత మెరుగవుతాయి.

## వైట్ రైస్..

ఇక అన్నింటికంటే చివరగా వైట్ రైస్ ఉంది. జాస్మిన్, బాస్మతి వంటి తెల్ల బియ్యాలు ఫైబర్ పరంగా తక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఫైబర్ తీసుకునే పరిమాణాన్ని ఒక్కసారిగా పెంచకుండా క్రమంగా పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి వారం సుమారు 5 గ్రాముల చొప్పున పెంచడం, తగినంత నీరు తాగడం, భోజనం తరువాత తేలికపాటి శారీరక కదలికలు చేయడం అవసరమని చెప్పారు. ఫైబర్ కేవలం జీర్ణక్రియకే కాదు, మొత్తం మెటబాలిజం ఆరోగ్యానికి మద్దతు ఇస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కోవిడ్ నుంచి కోలుకున్న వారిలో పెరుగుతున్న లంగ్ క్యాన్సర్ కేసులు.. అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన..



కోవిడ్-19 దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఇప్పటికే అనేక అధ్యయనాలు వెలుగులోకి వచ్చాయి. తీవ్ర అలసట, బ్రెయిన్ ఫాగ్, శ్వాసకోశ సమస్యలు, గుండె సంబంధిత ఇబ్బందులు వంటి సమస్యలు దీని తరువాత కనిపిస్తున్నాయి. తాజాగా జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, తీవ్రమైన కోవిడ్-19 లేదా ఇన్ఫ్లుయెంజా వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు భవిష్యత్తులో ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ పరిశోధనను యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా హెల్త్ సిస్టమ్ శాస్త్రవేత్తలు నిర్వహించి, సెల్ అనే జర్నల్‌లో ప్రచురించారు. ఈ అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తించారు. తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్లు శరీరంలోని ఇమ్యూన్ కణాలను రీప్రోగ్రామ్ చేస్తాయి. దీని వల్ల ఊపిరితిత్తుల్లో దీర్ఘకాలిక వాపు ఏర్పడి, ట్యూమర్ పెరుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఈ పరిస్థితి సంవత్సరాల పాటు కొనసాగవచ్చని పరిశోధకులు వెల్లడించారు.

## ఊపిరితిత్తుల్లో వాపు..

కోవిడ్ లేదా ఫ్లూ తీవ్రంగా వచ్చిన వారికి తరువాత కాలంలో ఊపిరితిత్తుల్లో వాపు కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చేందుకు దారి తీస్తుందని పేర్కొన్నారు. అయితే టీకాలు తీసుకోవడం వల్ల ఈ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు స్పష్టం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ప్రకారం ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మరణాల్లో అగ్రస్థానంలో ఉంది. పురుషులు, మహిళలు ఇద్దరిలోనూ ఇది అధిక మరణాలకు కారణమవుతోంది. ఎక్కువ సందర్భాల్లో ఈ వ్యాధి ఆలస్య దశల్లో గుర్తించబడడటం వల్ల చికిత్స అవకాశాలు పరిమితం అవుతున్నాయి. అయితే ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందుగానే స్క్రీనింగ్ చేయడం ద్వారా జీవనావకాశాలను మెరుగుపరచవచ్చని ఔనూ సూచిస్తోంది. ఈ అధ్యయనంలో భాగంగా చేసిన ప్రయోగాల్లో తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ల నుంచి కోలుకున్న జంతువుల్లో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరిగినట్లు కనిపించింది. అలాగే మనుషులపై సేకరించిన డేటాలో కూడా ఆసుపత్రిలో చికిత్స పొందిన కోవిడ్ రోగుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ 1.24 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. అయితే స్వల్ప ఇన్ఫెక్షన్లు ఈ ప్రమాదాన్ని పెంచలేదని పరిశోధకులు వెల్లడించారు.

## మారుతున్న ఊపిరితిత్తుల కణజాలం..

మరో కీలక అంశంగా తీవ్రమైన వైరల్ న్యుమోనియా ఊపిరితిత్తుల కణజాలాన్ని మారుస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది ప్రో-ట్యూమర్ వాతావరణాన్ని సృష్టించి ట్యూమర్ పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఈ మార్పులు నెలలు లేదా సంవత్సరాల పాటు కొనసాగవచ్చని అధ్యయనం సూచిస్తోంది. ఇప్పటి వరకు పొగ తాగడం వంటి కారణాలు మాత్రమే ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రమాదంగా భావించారు. అయితే ఈ తాజా ఫలితాల ప్రకారం తీవ్రమైన శ్వాసకోశ వైరల్ ఇన్ఫెక్షన్లను కూడా అదే విధంగా పరిగణించాల్సిన అవసరం ఉందని నిపుణులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి రోగులకు సిటి స్కాన్ల ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షణ అవసరం కావచ్చని నిపుణులు సూచించారు.

## టీకాలతో తగ్గుతున్న ప్రమాదం..

జీవశాస్త్ర పరంగా పరిశీలిస్తే తీవ్రమైన ఇన్ఫెక్షన్ల తర్వాత న్యూట్రోఫిల్స్, మాక్రోఫేజ్‌లు వంటి ఇమ్యూన్ కణాలు అసాధారణ స్థితిలోకి మారుతున్నాయి. ఇవి క్యాన్సర్‌ను నిరోధించే శక్తిని తగ్గించి వాపును పెంచుతాయి. అలాగే ఊపిరితిత్తుల కణజాలం కూడా మార్పులకు లోనై, మ్యూటేషన్లకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఇదిలా ఉంటే టీకాలు ఈ ప్రమాదాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అధ్యయనం వెల్లడించింది. ముందుగా వ్యాక్సిన్ తీసుకున్నవారిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్లు తగ్గడంతోపాటు ఊపిరితిత్తుల్లో జరిగే హానికర మార్పులు కూడా తగ్గినట్లు గుర్తించారు. తీవ్రమైన కోవిడ్-19 లేదా ఇతర వైరల్ న్యుమోనియా నుంచి కోలుకున్నవారు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా పొగ తాగే అలవాటు ఉన్నవారు లేదా ఇతర ప్రమాద కారకాలు ఉన్నవారు వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం అవసరం. టీకాలు తీసుకోవడం ద్వారా కేవలం తక్షణ రక్షణ మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక ఆరోగ్య ప్రమాదాలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే పానీయాలు ఇవి.. ఎలా తయారు చేయాలంటే..?



ఆహార జీర్ణక్రియలో కీలక పాత్ర పోషించే జీర్ణాశయం లేదా గ్యాస్ట్రోఇంటెస్టినల్ (+×) ట్రాక్ట్ ప్రధానంగా ఆహారాన్ని జీర్ణం చేయడం, పోషకాలను శోషించడం, వ్యర్థాలను బయటకు పంపించడం వంటి పనులు నిర్వహిస్తుంది. అయితే దీని పాత్ర కేవలం జీర్ణక్రియకు మాత్రమే పరిమితం కాదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం రోగనిరోధక శక్తి, మెటబాలిజం, మానసిక ఆరోగ్యంపై కూడా గణనీయమైన ప్రభావం చూపిస్తుంది. జీర్ణ వ్యవస్థలో లక్షల కోట్ల సూక్ష్మజీవులు నివసిస్తాయి, వీటిని కలిపి గట్ మైక్రోబియోమ్ అని పిలుస్తారు. వీటినే మంచి బ్యాక్టీరియా అని కూడా అంటారు. ఈ సూక్ష్మజీవులు ఆహారాన్ని విచ్ఛిన్నం చేయడంలో సహాయపడటమే కాకుండా, శరీరానికి రక్షణ వ్యవస్థగా కూడా పనిచేస్తాయి. అందుకే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం దెబ్బ తింటే, వ్యక్తి మొత్తం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.

## జీర్ణక్రియ వల్లనే రావు..

అయితే పోషకాహార నిపుణులు తెలిపిన ప్రకారం అనేక జీర్ణ వ్యవస్థ సమస్యలు కేవలం జీర్ణక్రియ కారణంగానే రావాల్సిన అవసరం లేదు. చాలా జీర్ణ వ్యవస్థ లక్షణాలు కేవలం తప్పు జీర్ణక్రియ వల్ల మాత్రమే రావు అని నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్, మ్యూకోసల్ రక్షణ, కొన్ని ఫైటోకెమికల్స్ వంటి అంశాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఈ అంశాలు ఆంత్రం గోడ సమగ్రతను, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఆంత్రం గోడను బలపరచడం, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడం కోసం ఆ వ్యవస్థకు మద్దతు ఇచ్చే గుణాలు కలిగిన పదార్థాలతో తయారయ్యే రెండు ఫంక్షనల్ డ్రింక్స్ రెసిపీలు ఇలా ఉన్నాయి.

## కలబంద, కొబ్బరి నీళ్ల పానీయం..

మొదటి పానీయం విషయానికి వస్తే.. అలో-కోకోనట్ గట్ సూతింగ్ డ్రింక్ గా దీన్ని చెప్పవచ్చు. దీనికి 200 మిల్లీలీటర్ల కొబ్బరి నీరు, 2 టేబుల్ స్పూన్ల తాజా అలొవెరా జెల్, 5-6 తాజా పుదీనా ఆకులు తీసుకోవాలి. ఈ పదార్థాలను 10 నుంచి 15 సెకన్ల పాటు బ్లెండ్ చేసి తాజాగా ఉన్నప్పుడే తాగాలి. అలొవెరాలో ఉండే ఆసెమానన్ వంటి పాలిశాకరైడ్లు ఆంత్రం మ్యూకోసల్ సమగ్రతను కాపాడడంలో సహాయపడతాయి. అలాగే దానిలో యాంటీ-ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అదనంగా కొబ్బరి నీరు ఎలక్ట్రోలైట్స్, తగిన హైడ్రేషన్‌ను అందిస్తాయి. ఇవి సాధారణ గ్యాస్ట్రోఇంటెస్టినల్ పనితీరుకు ముఖ్యం. మరోవైపు పుదీనా ఆకుల్లో ఉండే మెంథాల్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ స్మూత్ మజిల్స్‌ను సడలించడంలో సహాయపడుతుంది.

## అతి మధురం, సోంపు గింజల టీ..

రెండవ పానీయంగా లికోరైస్-ఫెన్నెల్ గట్ సపోర్ట్ టీ ని చెప్పవచ్చు. దీనికి ఒక కప్పు నీరు, పావు టీ స్పూన్ లికోరైస్ రూట్ పొడి (అతి మధురం), అర టీ స్పూన్ సోంపు గింజలు, అర టీ స్పూన్ తురిమిన అల్లం తీసుకోవాలి. ఈ పదార్థాలను 5 నుంచి 7 నిమిషాల పాటు మరిగించి వడకట్టి గోరువెచ్చగా తాగాలి. లికోరైస్ రూట్‌లో గ్లైసిరిజిన్, ఫ్లేవనాయిడ్లు ఉండి ఇవి గ్యాస్ట్రిక్, ఆంత్రం మ్యూకోసల్ రక్షణకు సహాయపడతాయి. అదనంగా సోంపు గింజల్లో ఉండే అనెథోల్ ఆంత్రం కండరాల సంకోచాలను తగ్గించి గ్యాస్ ఏర్పడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే,అల్లంలో ఉండే జింజరాల్స్ గ్యాస్ట్రిక్ మొటిలిటీని మెరుగుపరచడంలో, జీర్ణక్రియను సౌకర్యవంతంగా మార్చడంలో సహాయపడతాయి. ఈ రెండు పానీయాలను సులభంగా తయారు చేసుకోవచ్చు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఈ పానీయాలు ఎంతో మేలు చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు

# మొలకలను మీరు ఎలా తింటున్నారు..? నేరుగా తినకూడదు, ఎందుకంటే..?

మొలకలు (స్ప్రౌట్స్) ఆరోగ్యకరమైన ఆహారంగా చాలా కాలంగా మంచి పేరు సంపాదించుకున్నాయి. సలాడ్లు, చాట్స్, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్‌లో వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎక్కువగా ముడిగా తింటేనే ఆరోగ్యానికి మంచిదని చాలా మంది భావిస్తారు. బరువు తగ్గేందుకు, క్లీన్ ఈటింగ్ డైట్‌లో కూడా స్ప్రౌట్స్‌ను విస్తృతంగా సూచిస్తారు. అయితే ఆహారం ఎంత ముఖ్యమో దాన్ని ఎలా తీసుకుంటామన్నది కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. స్ప్రౌట్స్ పోషకాలను కలిగి ఉన్నప్పటికీ, ప్రతిరోజూ ముడిగా తినడం మంచిది కాకపోవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముడి మొలకలు తినడంలో ఒక ముఖ్యమైన సమస్య బ్యాక్టీరియా ప్రమాదం. మొలకలు వేడి, తేమ ఉన్న వాతావరణంలో పెరుగుతాయి. ఇదే పరిస్థితులు ఈ.కోలి, సాల్మొనెల్లా వంటి హానికర బ్యాక్టీరియా పెరగడానికి అనుకూలంగా ఉంటాయి.భారతీయ వంటకాలు

## ప్రోటీన్‌కు ప్రధాన వనరు కాదు..

మొలకలు తయారీ సమయంలో కలుషితం అయితే ఈ బ్యాక్టీరియా వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. కేవలం నీటితో కడగడం వల్ల ఇవి పూర్తిగా తొలగిపోవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే మొలకలను తేలికగా ఆవిరి పట్టించడం లేదా వేయించడం ద్వారా తినడం సురక్షితమైన మార్గంగా భావిస్తున్నారు. స్ప్రౌట్స్‌ను ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారంగా చాలా మంది భావిస్తారు. అయితే ఇది పూర్తిగా నిజం కాదని కూడా నిపుణులు చెబుతున్నారు. 100 గ్రాముల స్ప్రౌట్స్‌లో కేవలం 3-4 గ్రాముల ప్రోటీన్ మాత్రమే ఉంటుంది. ఇది ఇతర ప్రోటీన్ వనరులతో పోలిస్తే తక్కువ. అందువల్ల స్ప్రౌట్స్‌ను ప్రధాన ప్రోటీన్ వనరుగా కాకుండా, ఉపాహారంగా మాత్రమే తీసుకోవడం మంచిది. సరైన ప్రోటీన్ కోసం పప్పులు, పనీర్, గుడ్లు, టోఫు, శనగలు వంటి ఆహారాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.ఆరోగ్యకరమైన ఆహారం

## సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉంటే..

అంతేకాకుండా ముడి మొలకలు జీర్ణక్రియపై కూడా ప్రభావం చూపవచ్చు. వీటిలో అధికంగా ఫైబర్, ఫెర్మెంటబుల్ కార్బోహైడ్రేట్లు ఉండటం వల్ల కొందరికి జీర్ణ సమస్యలు రావచ్చు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉన్నవారికి లేదా ×దీూ వంటి సమస్యలు ఉన్నవారికి ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కనుక మొలకలను తేలికగా వండి తీసుకోవడం వల్ల సులభంగా జీర్ణమవుతాయి.

## ఎలా తినాలి..?

మొలకలను నిల్వ చేయడం కూడా చాలా ముఖ్యమైన విషయం.



ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల బ్యాక్టీరియా పెరుగుదల కొంత వరకు తగ్గుతుంది, కానీ పూర్తిగా ఆగదు. అందుకే మొలకలను ఫ్రిజ్‌లో ఉంచి 24 నుంచి 48 గంటల్లోపే ఉపయోగించడం మంచిది. ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచితే అవి చెడిపోయే ప్రమాదం ఉంటుంది. స్ప్రౌట్స్ పోషకాలు ఉన్న ఆహారం అయినప్పటికీ, వాటిని ఎలా తింటామన్నది చాలా ముఖ్యం. ముడిగా కాకుండా తేలికగా వండి తినడం, సరైన విధంగా నిల్వ చేయడం ద్వారా వాటి ప్రయోజనాలను సురక్షితంగా పొందవచ్చని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు.

# ప్రోటీన్లను అధికంగా తీసుకుంటే కిడ్నీలకు నష్టమే.. ఏం జరుగుతుందంటే..?



ప్రోటీన్ శరీర నిర్మాణానికి అత్యంత అవసరమైన పోషక పదార్థం. ఇది కండరాల పెరుగుదల, కణజాలాల పునరుద్ధరణ, అలాగే శరీరంలోని అనేక కీలక విధులను సక్రమంగా నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇటీవలి కాలంలో బరువు తగ్గడం, కండరాలను పెంచుకోవడం లేదా ఫిట్‌నెస్ లక్ష్యాల కోసం హై-ప్రోటీన్ డైట్‌లు విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి. అయితే, అవసరానికి మించి ప్రోటీన్‌ను దీర్ఘకాలం తీసుకోవడం వల్ల కిడ్నీలపై ఒత్తిడిని పెంచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కిడ్నీలు రక్తాన్ని శుద్ధి చేసి వ్యర్థాలను బయటకు పంపే ముఖ్య అవయవాలు. శరీరం ప్రోటీన్‌ను విభజించే సమయంలో నైట్రోజన్, యూరియా, క్రియాటినిన్ వంటి వ్యర్థ పదార్థాలు ఉత్పత్తి అవుతాయి. ఈ పదార్థాలను తొలగించేందుకు కిడ్నీలు ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. ప్రోటీన్ తీసుకునే పరిమాణం పెరిగితే కిడ్నీలపై పడే పని కూడా పెరుగుతుంది. ఆరోగ్యవంతమైన కిడ్నీలు కొంతవరకు దీనిని తట్టుకోగలిగినా, దీర్ఘకాలంలో అధిక ప్రోటీన్ వినియోగం కిడ్నీ నష్టం కలిగించే అవకాశం ఉంది.

## దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి వచ్చే అవకాశం..

ఇప్పటికే కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారికి హై-ప్రోటీన్ ఆహారం మరింత ప్రమాదకరం. ఎక్కువ ప్రోటీన్ తీసుకోవడం వల్ల కిడ్నీలు శుద్ధి చేయాల్సిన వ్యర్థాలు పెరుగుతాయి. ఇది కిడ్నీ పనితీరును మరింత దెబ్బతీసే అవకాశం ఉంటుంది. అందుకే దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి (జఖణ) ఉన్నవారికి వైద్యులు సాధారణంగా మితమైన ప్రోటీన్ తీసుకోవాలని సూచిస్తారు. ప్రస్తుతం ప్రోటీన్ పౌడర్లు, సప్లిమెంట్ల వాడకం పెరిగింది. ముఖ్యంగా బాడీ బిల్డింగ్ చేసే వారు వీటిని అధికంగా తీసుకునే సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రోటీన్ అధికంగా తీసుకోవడం వల్ల కిడ్నీ పనితీరు తగ్గిపోవడం, మూత్రంలో ప్రోటీన్ వెలువడటం (ప్రోటీన్యూరియా) వంటి సమస్యలు తలెత్తవచ్చు. అదనంగా డీహైడ్రేషన్, కిడ్నీ రాళ్లు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత వంటి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

## వైద్యుల సలహా అవసరం..

కనుక హై-ప్రోటీన్ డైట్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు, మధుమేహం లేదా అధిక రక్తపోటు ఉన్నవారు, వృద్ధులు, అలాగే ప్రోటీన్ సప్లిమెంట్లు వాడేవారు తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవాలి. ప్రోటీన్ శరీరానికి అవసరమైనప్పటికీ, దాన్ని సమతుల్యంగా తీసుకోవడం అత్యంత ముఖ్యం. వ్యక్తి బరువు, జీవనశైలి, శారీరక శ్రమను బట్టి రోజువారీ ప్రోటీన్ అవసరం మారుతుంది. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, మంచి కొవ్వులు వంటి ఇతర పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడేందుకు పరీక్షలు చేయించుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా క్రియాటినిన్, వ+ఖీ=, మూత్ర పరీక్షలు చేయించుకోవడం ద్వారా కిడ్నీ పనితీరును అంచనా వేయవచ్చు. హై-ప్రోటీన్ డైట్ తీసుకునే వారు ఈ పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవడం మంచిది. మొత్తానికి ప్రోటీన్ అవసరం ఉన్నప్పటికీ అధికంగా తీసుకోవడం కిడ్నీలకు హానికరం కావచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

# మెదడుకు అసలైన విశ్రాంతి ఇవ్వడం అంటే ఏంటి.. ఏం చేయాలి..?

ఇప్పటి వేగవంతమైన జీవనశైలిలో చాలామంది మానసికంగా అలసిపోయాం అని చెబుతుంటారు. అయితే ఈ అనుభూతి నిజమైన అలసట కాకపోవచ్చు. ఎక్కువ సందర్భాల్లో అది జ్ఞానాత్మక ఒత్తిడి (కాగ్నిటివ్ ఓవర్లోడ్) అయి ఉండవచ్చు. ఉదయం లేవగానే మెదడు సమాచారం ప్రాసెస్ చేయడం ప్రారంభిస్తుంది. నోటిఫికేషన్లు, మెసేజ్‌లు, సంభాషణలు, పనుల గడువులు, చుట్టూ ఉండే శబ్దం, డిజిటల్ కంటెంట్ వంటివన్నీ దృష్టిని ఆకర్షిస్తాయి. శారీరక అలసటలా ఇది స్పష్టంగా కనిపించదు. మెదడు ఇప్పటికే తీసుకున్న సమాచారాన్ని ప్రాసెస్ చేయకముందే మరిన్ని ఇన్‌పుట్‌లను స్వీకరిస్తూనే ఉంటుంది. ఈ నిరంతర ఉద్దీపన ప్రభావం కాలక్రమేణా బయటపడుతుంది. దృష్టి లోపించడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం, చిరాకు, సృజనాత్మకత తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది దీనిని మెంటల్ డ్రెయిన్ గా భావించినా, అసలు కారణం మెదడుపై అధిక సమాచారం భారం పడటమే.

## నిరంతరం పనిచేయదు..

మనిషి మెదడు నిరంతరం పని చేయడానికి రూపొందించబడలేదు. శరీర కండరాలకు విశ్రాంతి అవసరమైనట్లే, మెదడుకూ విరామం అవసరం. ఈ విరామాలు సమాచారాన్ని సరిచేయడానికి, భావోద్వేగాలను నియంత్రించడానికి, ఆలోచనలను క్రమబద్ధం చేయడానికి సహాయపడతాయి. అయితే చాలామంది



సోషల్ మీడియా స్క్రోలింగ్ లేదా టీవీ చూడడాన్ని విశ్రాంతిగా భావిస్తారు. కానీ ఇవి కూడా మెదడును ఉద్దీపన చేస్తాయి. చిత్రాలు, శబ్దాలు, సమాచారం వంటివి మెదడును పనిచేయించే కారణంగా, ఇది నిజమైన విశ్రాంతి కాదని నిపుణులు చెబుతున్నారు.

## ఏం చేయాలి..

మెదడుకు నిజమైన విశ్రాంతి ఇవ్వాలంటే ఉద్దేశపూర్వకంగా నిశ్శబ్ద సమయాన్ని కేటాయించాలి. నిశ్శబ్దంగా కూర్చోవడం, శ్వాసపై దృష్టి పెట్టడం, ధ్యానం చేయడం, ప్రకృతిలో గడపడం, లేదా ఎలాంటి అంతరాయం లేకుండా ఆలోచనలను స్వేచ్ఛగా ప్రవహించనివ్వడం వంటి చర్యలు మెదడును రీసెట్ చేయడంలో సహాయపడతాయి. అదేవిధంగా నాణ్యమైన నిద్ర కూడా మానసిక శక్తిని పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మెదడుకు సరైన విశ్రాంతి లేకుండా నిరంతరం పని చేయిస్తే శరీరం స్ట్రెస్ హార్మోన్లను విడుదల చేస్తూనే ఉంటుంది. దీని వల్ల నర వ్యవస్థ ఎప్పుడూ అప్రమత్త స్థితిలో ఉంటుంది. ఈ ఒత్తిడి తక్కువగా అనిపించినా, దీర్ఘకాలంలో మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చిరాకు, మతిమరుపు, భావోద్వేగ అలసట వంటి సమస్యలు పెరుగుతాయి. మరోవైపు సమయానుకూలంగా విరామాలు తీసుకుంటే దృష్టి పెరుగుతుంది, భావోద్వేగ స్థిరత్వం మెరుగుపడుతుంది, సవాళ్లను సమర్థంగా ఎదుర్కోగల సామర్థ్యం పెరుగుతుంది.

## అలా చేయడం సోమరితనం కాదు..

ఎప్పుడూ బిజీగా ఉండడాన్ని గొప్పగా భావించే సమాజంలో కొంతసేపు ఆగడం చాలా మందికి అసౌకర్యంగా అనిపిస్తుంది. విశ్రాంతి తీసుకుంటే పనితీరు తగ్గుతుందని భావిస్తారు. కానీ నిజానికి ఇది తప్పు అభిప్రాయమని నిపుణులు చెబుతున్నారు. లోతైన విశ్రాంతి సోమరితనం కాదు, అది మెదడుకు అవసరమైన మద్దతు. శారీరక శ్రమ తర్వాత కండరాలు ఎలా పునరుద్ధరించబడతాయో, అలాగే మెదడుకూ విశ్రాంతి అవసరం. సరైన విశ్రాంతి తీసుకున్నప్పుడు, మనుషులు మరింత ఉత్సాహంతో, స్పష్టమైన ఆలోచనలతో, మెరుగైన పనితీరుతో తిరిగి పనిలోకి ప్రవేశిస్తారని నిపుణులు సూచిస్తున్నారు.

# దేవస్థానాల్లో అర్చకులకు 1వ తేదీనే జీతాలు అందేలా చూడాలి

### బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీకి డైరెక్టర్ ఫణి కుమార్ విజ్ఞప్తి



విజయవాడ శ్రీ వార్త న్యూస్: ఎండోమెంట్స్ డిపార్ట్ మెంట్ అడిషనల్ కమిషనర్ ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ ను ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఖీూజ)గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో శుక్రవారం గొల్లపూడిలోని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి.వి.ఫణి కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫణి కుమార్ మాట్లాడుతూ, నూతన బాధ్యతల్లో చంద్రశేఖర్ ఆజాద్ విజయవంతంగా పనిచేస్తూ బ్రాహ్మణ సమాజ సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేయాలని కోరామన్నారు. అర్హులైన నిరుపేద బ్రాహ్మణులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందేలా చూడాలని, దేవాదాయ శాఖలో అర్చకులందరికీ 1వ తేదీనే జీతాలు పడేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశామన్నారు.గతంలో చనిపోయిన నిరుపేద బ్రాహ్మణులకు గరుడ పథకం కింద రూ.10 వేలు ఇచ్చేవారని, ఆ పథకాన్ని పునరుద్ధరించేలా కృషి చేయాలని కోరామన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం విశేష కృషి చేయాలని ఆయనను కోరినట్లు తెలిపారు.



# ఈడేపల్లి సత్యసాయి మందిరంలో ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

### పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: ఈడేపల్లిలోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మందిరంలో శ్రావణ పౌర్ణమి శుక్రవారం సందర్భంగా సామూహిక విశిష్ట వరలక్ష్మి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.బ్రహ్మశ్రీ పోతుకూచి ఆంజనేయ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వ్రతాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా విభాగం ఇంచార్జ్ శ్రీమతి బి.కాళికాదేవి, శ్రీమతి కొట్టి నాగమణి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రగతి విద్యాసంస్థల అధినేత శ్రీమతి సనక ఉమా, శ్రీమతి పోతుకూచి నాగమణి, వై.విజయలక్ష్మి తదితరులు వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ శాంతినిలయంలో స్వామి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతాలు ప్రారంభమయ్యాయని, నాటి నుండి సత్యసాయి సంస్థల్లో వ్రతాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చారుమతి లాగా ప్రతి మహిళ ఉత్తమ గుణాలు కలిగి ఉండి, తోటివారిలో భగవత్ స్వరూపాన్ని చూడగలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, దారా సూర్యచంద్రరావు, వై.రాజమోహన్ తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు ప్రజల మద్దతు

### చిన ఓగిరాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ



ఉయ్యూరు శ్రీ వార్త న్యూస్: పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు రూరల్ మండలం చిన ఓగిరాల గ్రామంలో గురువారం కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గ్రామ టీడీపీ అధ్యక్షులు ఓగిరాల నాగభూషణం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. సూపర్-6 పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు ఆకర్షించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను బలపరచాలని కోరారు. కార్యక్రమంలో ఉయ్యూరు మండల పార్టీ అధ్యక్షులు వెనిగళ్ళ కుటుంబరావు, ఏఎంసీ ఛైర్మన్ కొండా ప్రవీణ్ కుమార్, పాలడుగు మల్లి, యార్లగడ్డ సాయి, గ్రామ ప్రధాన కార్యదర్శి చేగొండి శివరామకృష్ణ, రైతు నాయకులు కంచర్ల కోటేశ్వరరావు, వల్లభనేని చినబాబు, మంచిగంటి రమేష్, తెలుగు యువత నేతలు తుమ్మలచర్ల హరీష్, అశ్విన్, రాంబాబు, వంపుగాని రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.



# వేమవరం కొండలమ్మ ఆలయంలో ఘనంగా శ్రావణ శుక్రవార పూజలు, చండీ హోమం

### 100 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చనలు, శ్రావణ పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పంచహారతులు, నక్షత్ర హారతి, పంచదీప హారతి, సింహ హారతి, నాగ హారతి, కుంభ హారతి, కర్పూర హారతి నిర్వహించారు. అనంతరం వడ్లమన్నాడు వాస్తవ్యులు కీ.శే.తోట లక్ష్మయ్య కుమారుడు, దుర్గ టెంట్ హౌస్ అధినేత తోట ప్రసన్నాంజనేయులు, ధనలక్ష్మి దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు. 100 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులు తమ విరాళాలను దేవస్థానం సేవింగ్ అకౌంట్ నంబర్ 45363190094, ×ఖీూజ - ాదీ×చీ0001461, ాదీ× గుడ్లవల్లేరు బ్రాంచ్ కు ఆన్ లైన్ ద్వారా జమ చేసి అమ్మవారి అనుగ్రహం పొందాలని దేవస్థానం చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ముగం ఆంజనేయులు, తూము రాజ్యలక్ష్మి, ఉస్తేల కోటేశ్వరమ్మ పాల్గొన్నారని కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.



# హత్యాయత్నం కేసులో ముద్దాయికి 5 ఏళ్ల జైలు శిక్ష

### జక్కులనెక్కలం ఘటనలో మహిళా సెషన్స్ కోర్టు తీర్పు



**ఎస్పీ విజ్ఞప్తి:**

క్షణికావేశంలో చేసే నేరం జీవితాన్ని జైలుపాలు చేస్తుందని,చిన్న వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధి జక్కులనెక్కలం గ్రామంలో 2020లో స్థల వివాదం నేపథ్యంలో బాబాయిపై కత్తితో దాడి చేసిన హత్యాయత్నం కేసులో ముద్దాయికి విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించింది.కేసరపల్లి గ్రామానికి చెందిన ఈర్ల వీరాంజనేయులుకు తన బాబాయితో స్థల వివాదం ఉండేది. జక్కులనెక్కలం గ్రామంలో ఇరువురి మధ్య ఘర్షణ జరగగా క్షణికావేశంలో వీరాంజనేయులు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై గన్నవరం పోలీసులు సీ ఆర్ నెంబర్ 444/2020 ఖ/ం 307, 447 ఐ పీ సీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. వాదనలు పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష ఖరారు చేసింది. కేసులో సమర్థవంతంగా వాదించిన సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.జ్ఞానాంబిక, దర్యాప్తు అధికారులు, సీ ఎం ఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, అభినందించారు.

# ఈవీఎం గోదాము తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గోదామును శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఈవీఎంలు భద్రపరచిన గోదాము, వాటి సీళ్లు, సెక్యూరిటీ, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి రిజిస్టర్ లో సంతకం చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.డిప్యూటీ సీఈవో, స్టేట్ ఈవీఎం నోడల్ ఆఫీసర్ ఎస్ ఆంజనేయులు, సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్ రెడ్డి, శ్యామ్ నాథ్ ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# అమ్మ గర్భాన నేర్పిన అమృత భాష తెలుగు

### రుస్తుంబాద పార్కు బాలికల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: అక్షరం లేకపోతే వెలుగు లేనట్టే, అక్షరం లేకపోతే బతుకు మెరుగు కానట్టేనని రుస్తుంబాద పార్కు నగరపాలక సంస్థ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ ఇందిరాదేవి అన్నారు.తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు చందమామ బాబు ఆధ్వర్యంలో “తెలుగు వినండి.. తెలుగులో మాట్లాడండి.. తెలుగు చదవండి.. తెలుగులో రాయండి” అనే సందేశంతో రూపొందించిన కరపత్రాలను ఉపాధ్యాయులు, విద్యార్థినుల చేతుల మీదుగా ఆవిష్కరించి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇందిరాదేవి మాట్లాడుతూ తెలుగు కమ్మని భాష, అమ్మ భాష, మన ఆత్మగౌరవానికి ప్రతీక అని, మన భాషను మనమే ప్రేమించాలన్నారు. గత పదో తరగతి పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు తెలుగులో 100కు 99 మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. వెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు చందమామ బాబు మాట్లాడుతూ, మాతృభాషే మన ఆత్మ, ఆత్మగౌరవమని, విద్యార్థి దశ నుండే మాతృభాషను ప్రేమించాలన్నారు. పాఠశాలల నుంచి పరిపాలన, న్యాయస్థానాల వరకు తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగును జీవన విధానంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.మాధవి, ఎం.సరోజినీ, పి.అమ్మాజీ, కె.రాగసుత, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



### రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎంపీ బాలశౌరికి

# రాఖీ కట్టిన జనసేన వీర మహిళలు



విజయవాడ శ్రీ వార్త న్యూస్: రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన జనసేన వీర మహిళలు విజయవాడలోని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి క్యాంపు కార్యాలయంలో ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పినిశెట్టి కుమారి ఆధ్వర్యంలో వీర మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వల్లభనేని బాలశౌరి వీర మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ట్రస్ట్ ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జ్ బండి రామకృష్ణ




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జ్ బండి రామకృష్ణ నివాసంలో స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, మచిలీపట్నానికి చెందిన షేక్ రఫీ మరియు ఆయన స్నేహితులు కలిసి సమాజ సేవే లక్ష్యంగా స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మచిలీపట్నం, పరిసర ప్రాంతాల్లో ఆకలితో బాధపడుతున్న పేదలకు ఆహారం అందించడంతో పాటు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు విద్యను అందించాలనే సంకల్పంతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ఎంతోమంది పేదలు కనీస ఆహారం, విద్య కోసం ఎదురుచూస్తున్నారని, అలాంటి వారికి అండగా నిలిచేందుకు స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు రావడం ఆదర్శప్రాయమని ఇన్చార్జ్ బండి రామకృష్ణ తెలిపారు. ట్రస్ట్ ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, పేదలు మరియు నిరుపేదలకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

### అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్లతో

# రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, శాసన సభ్యులు, ఎంపీలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో వర్చువల్ విధానంలో సమావేశమై వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.కృష్ణాజిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జిల్లా రెవెన్యూ అధికారి కే. శ్రీధర్ రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజన్ యాక్షన్ యూనిట్స్, పి-4 కార్యక్రమాల పురోగతిని రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్షించి, ఆయా కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత కాలవ్యవధిలో సాధించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, సిపిఓ ఎస్ ఉమాదేవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, మత్స్య శాఖ అధికారి అయ్యా నాగరాజా, మార్కెటింగ్ ఏడి నిత్యానంద్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నేపాల్ వరదల్లో చిక్కుకున్న కృష్ణా జిల్లా వాసి ఆచూకీ కోసం చర్యలు ---- జిల్లా కలెక్టర్ డీకే బాలాజి




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా మానస సరోవర్--కైలాస యాత్రకు వెళ్లిన కృష్ణా జిల్లాకు చెందిన చొప్పవరపు రమేష్ అక్కడ చిక్కుకున్నట్లు సమాచారం అందిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్ఓ చాంబర్ నుంచి మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్ వివరాలు వెల్లడించారు. చొప్పవరపు రమేష్ కుటుంబ సభ్యులను జిల్లా యంత్రాంగం సంప్రదించి, వారి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు.రమేష్ ఆచూకీని త్వరితగతిన గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే నేపాల్ అధికారులతోనూ సమన్వయం చేసుకుంటూ రమేష్ ఆచూకీ కోసం అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.వీలైనంత త్వరగా ఆయన ఆచూకీని గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించేలా చర్యలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# గుంటూరులో పీఎస్ శ్రీనివాస్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన ఎంపీ వల్లభనేని బాలశౌరి



గుంటూరు శ్రీ వార్త న్యూస్: గుంటూరులోని వెన్యూ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పీఎస్ శ్రీనివాస్ కుమారుని వివాహ రిసెప్షన్‌కు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన నాగబాబు

### ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్సీ నాగబాబు భేటీ

### ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

### నాగబాబుకు క్యాబినెట్ హోదా కల్పించిన ప్రభుత్వం

### 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచడమే లక్ష్యం



అమరావతి: జనసేన ఎమ్మెల్సీ, మెగా బ్రదర్ కొణిదెల నాగబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఆయన సతీసమేతంగా ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా నాగబాబు దంపతులను సీఎం చంద్రబాబు సత్కరించి, నూతన బాధ్యతలకు గాను శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు, మంగళగిరి లోని అరణ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగబాబు ఏపీ గ్రీన్ సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన తన అర్ధాంగి పద్మజతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పదవిని అలంకరించారు. ఈ పదవికి ప్రభుత్వం ఆయనకు క్యాబినెట్ హోదా కల్పించింది. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం అడవులు, చెట్లను పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఏపీ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా నాగబాబుకు ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన నాగబాబుకు పీసీసీఎఫ్ పి.వి. చలపతి రావు, అదనపు పీసీసీఎఫ్ రాహుల్ పాండే సహా పలువురు అటవీ శాఖ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001